J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 41 సంచిక : 51 27.5.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## విభజనాంధ్రలో పార్టీల పంథా

# విభజించు.. పాలించు

- కోనసీమలో రగిలిన చిచ్చు
- ఎప్పటికీ కడుక్కోలేని రొచ్చు
- ముందుకు వెళ్లలేక, వెనక్కు రాలేక సతమతమవుతున్న సర్కారు



కక్షలు... కార్పణ్యాలు అంటే తెలియని కోనసీమ ఒక్కసారిగా భగ్గున మండింది. ప్రజాప్రతినిధుల నివాసాలు, ప్రభుత్వ ఆస్తులు, ఆర్టీసీ బస్సులు ప్రజాగ్రహ జ్వాలల్లో కాలి బూడిదైపోయాయి. దాదాపు 3 దశాబ్దాల తరువాత ఆంధ్రాలో ఇలాంటి ఘటనలు జరిగాయి. రాష్ట్ర విభజన సమయంలోను తెలుగువారిలో ఇంతటి వ్యతిరేకత, అసహనం కనపడలేదు. కేవలం ఒక జిల్లాకి పేరు మార్చినందుకు ఇంతటి భీభత్సం జరిగిందంటే నమ్మశక్యంగా లేదు.

10 లో

## రవి సన్నారెడ్డికి 'గౌరవ డాక్టరేట్'



రాష్ట్ర గవర్నర్ మరియు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతులమీదుగా వైస్ ఛాన్సలర్ సుందరవల్లి సమక్షంలో 'గౌరవ డాక్టరేట్' అందుకుంటున్న ఈ తరం హీరో డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ 6,7వ స్నాతకోత్సవం చిరస్మరణీయోత్సవంగా, నయనానందకర సంబరంగా జరిగింది. విజయవాడ నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఈ స్నాతకోత్సవాలలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కాన్సర్ ఆసుపత్రిని కూడా గవర్నర్ సందర్శించారు.

5లో

## చిరస్మరణీయోత్సవం

## విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ

# స్నాతకోత్సవం

- నెల్లూరుకు వచ్చి వెళ్లిన గవర్నర్
- విద్యార్థినీ విద్యార్థులకు డిగ్రీల బహుకరణ
- రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి సందర్శన

## విజయోస్తు..!

జన్మభూమిపై మమకారంతో
శ్రీసిటీని పరిశ్రమల ప్రాకారం చేసి
తన కలలను సాకారం చేసుకుంటున్న
చిరంజీవి
**డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి**
ప్రతిభకు గుర్తుగా
విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుండి
'గౌరవ' డాక్టరేట్ అందుకున్న సంతోష సందర్భంలో
నా శుభాశీస్సులు.



'పద్మభూషణ్'
**వరప్రసాద్‌రెడ్డి**
వ్యవస్థాపకులు, ఛైర్మన్ - శాంతా బయోటెక్నిక్స్



## సంగం, నెల్లూరు బ్యారేజీల పనులు
# ఒక కొలిక్కి వస్తున్నాయి




నెల్లూరుజిల్లాలోని సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీల నిర్మాణపు పనులు ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తున్నాయి. సంగం బ్యారేజీకి దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరు పెడతామని, త్వరలోనే ఆ బ్యారేజీని తాము స్వయంగా ప్రారంభిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించివున్న నేపథ్యంలో ఆ బ్యారేజీల నిర్మాణపు పనులు ఊపందుకున్నాయి. ఈనెల 24న తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి తదితర అధికారులు ఈ పనులను పరిశీలించారు. సంగంలో రెండు వరుసల వంతెన, గేట్లకు మోటార్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు చివరిదశకు వచ్చాయని, బ్యారేజీ వద్ద ఏర్పాటుచేసేందుకు దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహాల తయారీ కూడా జరుగుతోందని, బ్యారేజీ ప్రారంభోత్సవం ఎప్పుడన్నది ప్రభుత్వం నిర్ణయిస్తుందని ఈ సందర్భంగా హరినారాయణరెడ్డి చెప్పారు. అదేవిధంగా నెల్లూరు బ్యారేజీ నిర్మాణం కూడా పూర్తయిందని, ప్రారంభానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ఆయన వెంట డిఇఇలు శ్రీనివాసులురెడ్డి, విజయరామిరెడ్డి తదితరులున్నారు.

# విఎస్‌యులో క్యాంపస్ ఇంటర్వ్యూలు

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు భవన్‌లో ఇటీవల అవంతి ఫీడ్స్ కంపెనీవారు మెరైన్ బయాలజీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు సీనియర్ టెక్నికల్ సైంటిస్ట్ డా. పి.శ్రీనివాస్, రీజనల్ మేనేజర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూలకు మైరైన్ బయాలజీ విభాగానికి చెందిన 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రౌండ్ సెలక్షన్స్ పూర్తి చేశారు. రెండవ రౌండ్ కొవ్వూరులోని అవంతి ఫీడ్స్ కంపెనీలో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైరైన్ బయాలజీ హెడ్ డా. యం.హనుమరెడ్డి, డా. సీహెచ్.విజయ, డా'. సీహెచ్ వెంకటరాయులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా పి.చెంచురెడ్డి పాల్గొన్నారు. మైరైన్ బయాలజీ విద్యార్థులకు కాంపస్ ప్లేస్మెంట్స్ కోసం అవంతి కంపెనీ ప్రతినిధులు విశ్వవిద్యాలయ కళాశాలకు రావడం ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయానంద్ కుమార్ బాబు ఈ సందర్భంగా తెలిపారు.

### ర్యాగింగ్ నిరోధానికి అవగాహన :

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాల అధ్వర్యంలో ఇటీవల కళాశాల విద్యార్థులకు యాంటి ర్యాగింగ్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో జాయింట్ కలెక్టర్ హరీంద్రప్రసాద్ పాల్గొని విద్యార్థులు చిన్నప్పటి నుండే విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని అలవరచుకోవాలని, ప్రణాళికాబద్ధంగా చదవడం వల్ల విద్యార్థులు నిర్దేశించుకొన్న లక్ష్యాలను సాధించగలరని చెప్పారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డా. బిందుమీనన్ మాట్లాడుతూ స్వల్పకాలిక అనందం కోసం సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ వంటి దుశ్చర్యలకు పాల్పడడం మంచిది కాదని, అందువల్ల జూనియర్ విద్యార్థుల ఆత్మస్థైర్యం దెబ్బ తింటుందని, భవిష్యత్తులో అది ఇతర మానసిక రుగ్మతలకు కూడా దారి తీస్తుందని వివరించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలుగుతూ బాగా చదువుకోవాలని విఎస్‌యు రిజిస్ట్రార్ డా. ఎల్.విజయ కృష్ణారెడ్డి అన్నారు. విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు కల్పించడంలో విశ్వవిద్యాలయం తరఫున అధికారులంతా తమ వంతు కృషిచేస్తున్నారని ఆయన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయానంద్ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమ కన్వీనర్ డా. యం.హనుమారెడ్డి, యాంటి ర్యాగింగ్ కమిటీ సభ్యులు డా పి.సుబ్బరామ రాజు, డా వై.విజయ, డా మేరి సందిప, డా. యం.త్యాగరాజు, డా శ్రీకన్యరావు, కె.సునీత తదితరులు పాల్గొన్నారు.




## పేద బ్రాహ్మణులకు
# స్కాలర్‌షిప్‌లు

పేద బ్రాహ్మణులు ఉన్నత విద్యలు చదువుకునేందుకు నెల్లూరులోని పేద బ్రాహ్మణ ఉన్నత విద్య సహాయక ట్రస్ట్ వారు విద్యాస్కాలర్‌షిప్‌లు అందజేయాలని నిర్ణయించారు. జిల్లాలో ప్రతిభ కలిగిన పేద బ్రాహ్మణ విద్యార్థుల నుంచి అందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అర్హత గల డిగ్రీ (ప్రథమ, ద్వితీయ) సంవత్సరం, మరియు బిటెక్ (ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలు), మరియు పీజీ చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల నుంచి జూన్ 10వ తేదిలోగా దరఖాస్తులను పంపాలని ట్రస్ట్ నిర్వాహకులు ఎస్‌విఎల్ ప్రసాదరావు, ఎనమండ్ర నాగదేవి ప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9885199553, లేదా 9440164423 అనే నంబరుతోగానీ సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## ధాన్యం డబ్బులు..
# ఇవ్వకపోవడం దారుణం

జిల్లాలో రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను మూడు నెలలవుతున్నా చెల్లించకపోవడం దారుణమని, డబ్బులు రాకపోవడంతో రైతులు ఎంతగానో ఇబ్బందులు పడుతున్నారని జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. ఈనెల 23న టిడిపి ఆధ్వర్యంలో కోవూరులో జరిగిన 'స్పందన' కార్యక్రమంలో తహాశీల్దారు సుబ్బయ్యను కలసి వినతిపత్రం సమర్పించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 21 రోజుల్లో డబ్బు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పినా ఇంతవరకు రైతుల ఖాతాల్లో వాటి తాలూకు డబ్బు జమకాలేదన్నారు. సమయానికి డబ్బు అందకపోవడంతో రైతుల కుటుంబాలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి, రవికుమార్, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శివకుమార్ పాల్గొన్నారు.




# పథకం కేంద్రానిది.. ప్రచారం జగన్‌ది

## 'నవరత్నాల'న్నీ కేంద్ర పథకాలకు 'రీ-ప్యాకింగ్'లే - ధ్వజమెత్తిన బిజెపి నేతలు

ప్రధాని నరేంద్రమోడీ దేశవ్యాప్తంగా ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారని, వాటిని ఆంధ్రప్రదేశ్‌లో తన ప్రచార దాహానికి పరాకాష్టగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతి కేంద్రపథకం పేరుపై తన స్టిక్కర్లు వేసుకుంటూ తనపేరును ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని బిజెపి నేతలు ధ్వజమెత్తారు. ఈనెల 26 గురువారం నాడు నెల్లూరులో జరిగిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బిజెపి నేతలు రాష్ట్రప్రభుత్వం తీరును, ముఖ్యమంత్రి విధానాలను దుయ్యబట్టారు. పెద్దఎత్తున ఏర్పాటైన సభావేదికపై బిజెపి జాతీయ అధ్యక్షులు సత్యకుమార్, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు సోము వీర్రాజు, జాతీయ కార్యవర్గసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ సహ ఇన్‌చార్జి సునీల్ డియోధర్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాధవ్‌తో పాటు పాతూరి నాగభూషణం తదితర నాయకులు పాల్గొని వైకాపా విధానాలను తూర్పారబట్టారు. నవరత్నాల పేరుతో అమలుచేస్తున్న చాలా పథకాలు తిరిగి 'రీ-ప్యాక్' చేయబడిన కేంద్ర ప్రభుత్వ పథకాలేనని, 'నవరత్నాల' పథకాలకు నిధుల కోసం వైకాపా ప్రభుత్వం అనేక సందర్భాల్లో కేంద్రప్రభుత్వ నిధులను దారిమళ్ళించిందని వారు ఆరోపించారు. కేంద్రప్రభుత్వం వివిధ పథకాల కింద అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక కేటాయింపులు చేస్తోందని వారు ఆ లెక్కలన్నీ వివరించారు. కేంద్రప్రభుత్వం ఇంతగా సాయం చేస్తున్నా ప్రస్తుత వైకాపా కానీ, గత టిడిపి ప్రభుత్వం కానీ వారి మోసపూరిత రాజకీయాల కారణంగా ఆ సాయాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు. జగన్ స్టిక్కర్లు వేయలేని కేంద్ర ప్రభుత్వ పథకాలను ఉద్దేశపూర్వకంగా అమలుచేయకుండా వైకాపా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, ఇలా వ్యవహరించినందుకు గత ఎన్నికల్లో టిడిపి భారీ ఓటమిని చవిచూసిందని, 2024 ఎన్నికల్లో వైకాపాకి కూడా అదే గతి పట్టనుందని వారు పేర్కొన్నారు. దేశంలోని ప్రతి ప్రధానమైన కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థ నేడు ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, అందుకు చొరవ చూపుతున్న ప్రధాని మోడీకి తాము కృతజ్ఞతలు చెప్తున్నామని అన్నారు.

### రాష్ట్రాభివృద్ధికి టిడిపి, వైసిపి చేసిందేమీ లేదు :

రాష్ట్రాభివృద్ధికి టిడిపి-వైసిపిలు చేసిందేమీ లేదని బిజెపి నాయకులు ఈ సందర్భంగా విమర్శించారు. రాష్ట్రంలో కనిపించే అభివృద్ధి అంతా కేంద్రప్రభుత్వ నిధులతోనే జరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన అన్ని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద నిర్మించబడ్డాయని, 'నాడు-నేడు' బ్యానర్ కింద పాఠశాలల పునరుద్ధరణ కేంద్రప్రభుత్వ పథకం సర్వశిక్షా అభియాన్ నుండి జరుగుతున్నాయని, వైసిపి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి సొంతంగా చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మకమైన పోలవరం ప్రాజెక్టును జాతీయ నీటిపారుదల ప్రాజెక్టుగా చేపట్టి ప్రధాని మోడీ నిధులు కేటాయించారని, ఇప్పటిదాకా ఈ ప్రాజెక్టుకు 11,600 కోట్లు ఇచ్చారని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే సంకల్పంతో కేంద్రప్రభుత్వం ఉందని బిజెపి నేతలు తెలిపారు. గత టిడిపి, ఇప్పటి వైసిపిల అక్రమ, అవినీతి విధానాల వల్లనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేయడంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో పోలవరం, ఇతర ప్రాజెక్టుల అవినీతిపై గతంలో పుస్తకాలు ప్రచురించిన వైసీపీ అధికారంలోకి రాగానే ఒక్కసారిగా సైలెంట్ అయిపోయిందని వారు పేర్కొంటూ, పోలవరం ప్రాజెక్టులో టిడిపి అవినీతిని వైసిపి ఎందుకు కాపాడుతోందని ప్రశ్నించారు. పూర్తిగా కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన పోలవరం ప్రాజెక్టు నిధులను దోచుకోవడంలో వైసిపి-టిడిపిల మధ్య రహస్య ఒప్పందం, భాగస్వామ్యం ఉన్నట్లు స్పష్టమవుతోందని బిజెపి నాయకులు ఆరోపించారు. రాష్ట్రానికి అన్ని విధాలా పూర్తిస్థాయి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ సారధ్యంలో ప్రజల కోసం అమలుచేస్తున్న అనేక పథకాలను ప్రజలకు చేరువచేయాలని, కేంద్ర పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని వారు ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు నాయకులకు పిలుపునిచ్చారు. బిజెపి ద్వారానే రాష్ట్రానికి అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్ర ప్రజలు బిజెపిని ఆదరించాలని వారు కోరారు.

# రైతన్నలకు అండగా నిలుస్తున్న సిఎం జగన్

## - కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలను ప్రవేశపెట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నలకు అండగా నిలుస్తున్నారని, రైతులు ఈ వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 26వ తేది గురువారం బుచ్చిరెడ్డిపాళెంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ కొత్తగా ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్యసేవ వాహనాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో రైతుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన పలు పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డివిఎల్‌డిఏ ఛైర్మెన్ విజయకుమార్, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి, బుచ్చి నగర పంచాయతి ఛైర్మెన్ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

# ఎంతమంది పీకేలొచ్చినా.. ఏమీ పీకలేరు!

## మాజీమంత్రి సోమిరెడ్డి



ఎంతమంది పీకేలు వచ్చినా.. ఏమీ పీకలేరని, మహానాడు జయప్రదం కావడాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని, వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రాకుండా ఎవ్వరూ ఆపలేరని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 25న ఒంగోలులో మహానాడు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడుకు వస్తున్న స్పందన చూసి వైసిపి కడుపు మంటతో కాలిపోతోందని, మహానాయకుడు ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా జరుగుతున్న మహానాడు కార్యక్రమాలకు ఆటంకం కలిగించడం దారుణమని అన్నారు. ఆర్టీసీ బస్సులు ఇవ్వకుండా, ప్రైవేటు వాహనాలను రానివ్వకుండా యజమానులను బెదిరిస్తున్నారని, తెలుగోడు అంటే తలెత్తుకునే పరిస్థితిని ఆంధ్రులకు ఎన్టీఆర్ కల్పిస్తే... ఇప్పుడు వైకాపా తెలుగోడు తల దించుకునే పరిస్థితిని తీసుకొచ్చిందంటూ విమర్శించారు. పీకే సలహాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారంటూ ఆయన వైకాపా తీరును దుయ్యబట్టారు.

# ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్.. కొత్త కమిటీలు

అఖిలభారత దళిత గిరిజనుల సంక్షేమ సంఘం(ఏఐఎస్‌సిఎస్‌టిడబ్ల్యుఏ) ఇటీవల నెల్లూరులోని డా.అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో కొత్త కమిటీలను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆళ్ళ శివయ్యప్రభుకుమార్, రాష్ట్ర కార్యదర్శిగా ఇ.కేశవ కల్యాణ్‌లు ఎంపికయ్యారని ఆ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మనవల ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లా కమిటీకి ఈదూరు మనోహర్ ఉపాధ్యక్షులుగా, టి.వరలక్ష్మి ప్రధాన కార్యదర్శిగా, ఎం.దాస్, యు.గురవయ్యలు ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా, ఎం.మనోహర్ జాయింట్‌సెక్రటరీగా, కె.అరుణ్‌కుమార్ కార్యదర్శిగా ఎంపికయ్యారని, నెల్లూరు నగరశాఖ అధ్యక్షులుగా బి.పురుషోత్తం, సర్వేపల్లి నియోజకవర్గం అధ్యక్షులుగా డి.ఆశీర్వాదం ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

# నేత్రపర్వంగా.. హనుమజ్జయంతి



హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 25న జిల్లావ్యాప్తంగా ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాల్లో, రామాలయాల్లో నేత్రపర్వంగా వేడుకలు జరిగాయి. వేకువ నుంచే భక్తులు శ్రీ ఆంజనేయస్వామివారి దేవాలయాలకు వెళ్ళి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకారాలు చేసి విశిష్టపూజలు నిర్వహించారు. నెల్లూరు నగరంలోని ప్రసిద్ధమైన శబరి శ్రీరామక్షేత్రంలో కొలువైవున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామిని ప్రత్యేకంగా లక్ష మల్లెలతో అర్చించారు. చిన్నారులకు స్వామివారి వెండి డాలర్‌తో కంకణధారణ చేశారు. నగరంలోని రాయాజివీధిలో ఉన్న శ్రీ సీతారామలక్ష్మణ సమేత శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, సంతపేటలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, పప్పులవీధిలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాల్లో స్వామివారికి విశేషపూజలు చేశారు. ఆకుపూజలు చేసి తిరుమంజనం నిర్వహించారు. మైపాడుగేట్ వద్ద ఉన్న శ్రీ సీతారామంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి నగరోత్సవం, పల్లకిసేవ, పూలంగిసేవలు వేడుకగా చేశారు. జిల్లాలోని అన్ని ఆంజనేయ స్వామి దేవాలయాల్లో గజమాలలు, ధూపదీపహారతులతో, క్షీరాభిషేకాలతో స్వామివారికి పూజలు జరిగాయి. జై శ్రీరామ్!...జై హనుమాన్!..అంటూ భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చి శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.


శ్రద్ధాంజలి



ఈదూరు గ్రామంలో పాతతరం పెద్దల్లో
మాట విలువ కల్గి 50 సంవత్సరాలకు మునుపే
చెన్నై నగరంలో నిర్మల బ్లూమెటల్స్, మరియు
నిర్మల హోటల్స్ స్థాపనకు ఆద్యులు,
తదుపరి అదే రంగంలో పలువురికి ఆదర్శకులు అయిన
కీ॥శే॥ పోలంరెడ్డి ఈశ్వర్‌రెడ్డి గారి
జ్యేష్ఠ కుమారుడు
శ్రీ పోలంరెడ్డి రఘునాధరెడ్డి గారు
తేది: 19-05-2022 గురువారం
ఉదయం 8.30 గంటలకు స్వర్గస్తులైనారు.
వారి కర్మక్రతువులు
తేది: 02-06-2022 గురువారం ఉదయం 10 గంటలకు
డోర్.నెం.2-(22 పాత నెం) 16వ వీధి, జైనగర్,
అరుంబాకం (కోయంబేడు బస్టాండు దగ్గర),
చెన్నై-600106 నందు జరుగును.
కావున తెలియజేయడమైనది. (సెల్: 97910 42772)
శ్రీ పోలంరెడ్డి రఘునాధరెడ్డి గారు
కుటుంబసభ్యులు

లాయర్
మే 27, 2022

# ఫలవంతమైన ప్రధాని జపాన్ పర్యటన

ఇండో-పసిఫిక్ ప్రాంతాల్లో స్వేచ్ఛను పరిరక్షించేందుకు దృఢ-చిత్తంతో వ్యవహరిస్తామని క్వాడ్ దేశాల అగ్రనేతలు ప్రకటించడం ఆ ప్రాంతాల సుస్థిరతకు బాటలు వేసే శుభపరిణామం. ఆ ప్రాంతాల్లో చైనా విస్తరణవాదంతో దుందుడుకుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో క్వాడ్ సదస్సు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇదే సందర్భంగా ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రశంసలు పొందడంతో పాటు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో ఉన్న అనుబంధాన్ని మరింత పటిష్టం చేసుకుని రావడం హర్షదాయకం.



ఇటీవల భారత ప్రధాని నరేంద్రమోడీ రెండురోజుల జపాన్ పర్యటన ఫలవంతమైంది. మోడీకి 'క్వాడ్' దేశాల నేతలు ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం, మోడీ మాటలను ఆసక్తిగా వినడంతో పాటు భారత్ పట్ల, మోడీపట్ల తమకున్న సానుకూల దృక్పదాన్ని, అభిమానాన్ని చాటుకోవడం భారతీయులంతా సంతోషించే విషయం. ఒకవైపు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ఆగకపోయినా, కరోనా మహమ్మారి పీడ వదలకపోయినా, ఉగ్రవాదపు పడగనీడ పడుతూనే ఉన్నా, ప్రపంచంలోని అనేకదేశాల్లో అశాంతి ఆవరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో కీలకమైన క్వాడ్ దేశాధినేతల సమావేశం సహజంగానే అంతర్జాతీయస్థాయిలో ఆసక్తికరంగా మారింది. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ కలసి ఏర్పాటుచేసిన 'క్వాడ్' కూటమి శిఖరాగ్ర సమావేశం జపాన్‌లోని టోక్యో నగరంలో ఈనెల 23, 24 తేదీల్లో జరిగింది. భారత ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు బైడెన్, జపాన్ ప్రధాని కిషిడా, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని అల్బనీస్‌లతో కలసి ఈ సమావేశం జరుగుతుండడం చైనాలో గుబులు రేపింది. అసలు క్వాడ్ అంటేనే చైనాకి మంట. అందుకే 'ఈ కూటమి విఫలం కావడం ఖాయం' అంటూ ఆదిలోనే అమంగళం పలికింది. అయినా ఈ సదస్సు చైనా అనుకున్నట్లు విఫలం కాకపోగా, దిగ్విజయం కావడం క్వాడ్ దృఢచిత్తానికి, సంఘటిత శక్తికి నిదర్శనం. వాస్తవానికి ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా విస్తరణవాదానికి, అక్రమంగా చేపలవేట సాగించడం వంటి పెడసర ధోరణులను అరికట్టి ముకుతాడు వేయడానికి ఈ సదస్సు జరుగుతుందని చైనాకి కూడా తెలిసిన విషయమే. 'క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్' (క్వాడ్)..అనే నాలుగు ప్రజాస్వామ్యదేశాల కూటమి సమావేశం కావడం చైనాకు తొలినుంచీ మింగుడుపడని విషయం కూడా. అయితే, అందరూ ఊహించినట్లుగానే ఈ సదస్సులో చైనాను కట్టడిచేసే పలు నిర్ణయాలు జరిగాయి. ఇటీవల సరిహద్దులో ఉన్న లద్దాఖ్‌లోని పాంగాంగ్ సరస్సుపై చైనా వంతెన కట్టడం, సరిహద్దు పొడుగునా భారీస్థాయిలో వసతులు ఏర్పాటు చేసుకుంటుండడం జరుగుతున్న నేపథ్యంలో భారత ప్రధాని మోడీ టోక్యో పర్యటన ఇందులో మరింత కీలకంగా మారింది. ఇండో-పసిఫిక్ ప్రాంత స్వేచ్ఛను పరిరక్షించేందుకు దృఢచిత్తంతో వ్యవహరిస్తామని క్వాడ్ దేశాల అగ్రనేతలు ఈ సందర్భంగా ప్రకటించడం శుభపరిణామం. ఈ ప్రాంతంలోని అనేక దీవులను చైనా తన సైనిక స్థావరాలుగా మార్చుకుంటున్న నేపథ్యంలో, ఆయా ప్రాంతాల యథాతథ స్థితిని దెబ్బతీసేవిధంగా ఎవరు ప్రయత్నించినా సహించేది లేదని సదస్సు తేల్చిచెప్పింది. అంతరిక్షం, సాగరజలాలు, భద్రత, అభివృద్ధి తదితర అనేక అంశాల్లో ఈ నాలుగు దేశాల మధ్య తాజా ఒప్పందాలు అందరూ స్వాగతించదగ్గ సరికొత్త పరిణామంగా భావిస్తున్నారు. ఉక్రెయిన్‌లో అలముకున్న పరిస్థితులపై క్వాడ్ సదస్సు సానుభూతిని ప్రకటించింది. ఉగ్రవాదాన్ని సదస్సు తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాద తండాలను పెంచిపోషిస్తున్న పాక్‌ను ఉద్దేశించి ఆ పద్ధతులను మానుకోవాలని స్పష్టం చేసింది. సభ్యదేశాల సముద్ర జలాల పరిరక్షణను పరిపుష్టం చేసేందుకు, చైనా దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు ఇండో-పసిఫిక్ ఆర్థిక చట్రం ఏర్పాటు విషయం తెరమీదికి తీసుకు వచ్చింది. ఇండో పసిఫిక్ శాంతి సుస్థిరతలకు ఈ నిర్ణయాలు మేలుబాటలు వేసేవే. రెండు రోజుల పర్యటనలో ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో, జపాన్ ప్రధాని కిషిడాతో, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని అల్బనీస్‌తో చర్చలు జరిపారు. కరోనా సంక్షోభాన్ని ప్రజాస్వామిక పద్ధతుల్లో భారత ప్రధాని మోడీ ఎంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నారంటూ అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రశంసలతో ముంచెత్తడం విశేషం. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న వేళ భారత్ ఇతరదేశాలకు ఆదర్శంగా నిలిచిందంటూ కొనియాడారు. కష్టకాలంలో ప్రపంచానికి భారత్ వ్యాక్సిన్లను అందజేసి ఆదుకున్నదంటూ ఆస్ట్రేలియా,జపాన్ ప్రధానులు కూడా భారత్‌ను, ప్రధాని మోడీని అభినందించారు. ఏదేమైనా ఇండోపసిఫిక్ ప్రాంత పరిరక్షణకు క్వాడ్ సదస్సు మరింత సుస్థిరమైన బాటలు వేస్తుండడం హర్షదాయకం. ఇదే సందర్భంలో ప్రధాని మోడీ చొరవతో భారత్ అమెరికాల మధ్య, భారత్-జపాన్, భారత్-ఆస్ట్రేలియాల మధ్య దౌత్యసంబంధాలు మెరుగుపడేందుకు ఈ సదస్సు దోహదపడడం సంతోషకరం!...

## మళ్ళీ పెరుగుతున్న ఈవ్ టీజింగ్



గతంలో పబ్లిక్ ఈవ్ టీజింగ్ బెడద చాలా ఎక్కువగా ఉండేది. అనూహ్యంగా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వాలు చేసిన కఠిన చట్టాలు, చేపడుతున్న చర్యలవల్ల చాలావరకు అది నియంత్రించబడింది. అంతేకాకుండా కాలేజీలలో చదివే విద్యార్థినీవిద్యార్థులకు క్షణం తీరిక లేకుండా, తమ సమయాన్నంతా పుస్తకాలకే కాలేజీ నిర్వాహకులు పరిమితం చేయడంతో ఇక ఈవ్ టీజింగ్‌కి అవకాశమే లేకుండా పోయింది. అయితే, తాజాగా అక్కడక్కడా మళ్ళీ ఈవ్ టీజింగ్ సంఘటనలు పెరుగుతున్నాయి. కరోనా పుణ్యమా అంటూ యువత ఇళ్ళకే పరిమితం కావడం, కరోనా ఇంటి ముఖం పట్టినా వీళ్ళు మాత్రం ఇంకా ఇంటికే పరిమితం కావడం వల్ల, మళ్ళీ పాత పరిస్థితులే దాపురిస్తున్నాయేమో అనిపిస్తుంది. ఇటీవల నగరంలోని టీ దుకాణాలు, బేకరీలు, ఐస్‌క్రీమ్ పార్లర్లు, సినిమాహాళ్ళు వంటి ప్రాంతాలలో యువత ఎక్కువగా కనపడుతున్నారు. ముఖ్యంగా మగపిల్లలు ఎక్కువగా గుంపుగా ఉంటున్నారు. ఒంటరిగా లేదా స్నేహితురాళ్ళతో కలిసి వెళ్లే అమ్మాయిలను ఏడిపిస్తున్న సంఘటనలు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో జరుగుతున్న నేరాలు-ఘోరాలు, దాడులు, దోపిడీలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు అదుపు చేయడంలో విఫలమైన జిల్లా పోలీసు శాఖ, దిశ లాంటి సంఘటన మన జిల్లాలో జరగక ముందే ఈవ్ టీజింగ్ విషయంలో మేల్కొంటే మంచిది.

**సమస్యల తో 'రణం'**

- సంచారి

# చిన్నతనం నుండే చురుకైనవాడు.. మా రవిబాబు

'లాయర్' పత్రిక వారు తమ 40వ వార్షికోత్సవం సందర్భంగా 'విజయ పథంలో నెల్లూరీయులు' అనే కాఫీ టేబుల్ పుస్తకాన్ని సమగ్రంగా, సమర్ధవంతంగా, సంపూర్ణంగా ప్రచురించి కానుకగా అందించినందుకు మా అభినందనలు. 'నిన్నటి తరం సారథులను, నేటితరం వారధులను' రేపటి తరానికి పరిచయం చేస్తూ... స్ఫూర్తి ప్రదాతలుగా, కీర్తిమూర్తులుగా వారి జీవితాలను అర్ధవంతంగా ఆవిష్కరించారు.

ఆశయాలు, ఆకాంక్షలు అందరికీ ఉంటాయి. కానీ వాటిని నెరవేర్చుకునే శక్తి సామర్థ్యాలు కొందరికే ఉంటాయి. ఆలా... తాననుకున్న దానిని సాధించడం కోసం నిరంతరం శ్రమించి సాధించిన రియల్ హీరో మన నెల్లూరుజిల్లా అరవపాళెం గ్రామస్తులు సన్నారెడ్డి రాజగోపాలరెడ్డి - శ్రీమతి సరస్వతమ్మల తనయుడు రవీంద్ర సన్నారెడ్డి.

విదేశాలలో ఆయన గడించిన విద్య, విజ్ఞానాలను, అనేక దేశాలలో తాను దర్శించిన పారిశ్రామికవాడలను వాటి యొక్క ప్రయోజనాలను గుర్తించిన యువ మేధావి ఆయన. అలాంటి సదుపాయాలను, సౌకర్యాలను తన మాతృదేశంలో ఎందుకు కల్పించకూడదన్న సంకల్పంతో తన సొంత దేశంలో, తెలుగు రాష్ట్రంలో, తాను పుట్టిన జిల్లాలో ప్రత్యేక పారిశ్రామికవాడ స్థాపనకు శ్రీకారం చుట్టాడు మా రవిబాబు. 2006-07 మధ్య కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో, తన మిత్రుడు శ్రీనిరాజు సహకారంతో తన కలల ప్రతిరూపానికి శ్రీసిటీ(లక్ష్మి నగరం) అని నామకరణం చేయడంలోనే రవి దూరదృష్టి, విజ్ఞత మనకు కనిపిస్తాయి.

రవిబాబు నాటిన విత్తనం మహావృక్షమై, అంతర్జాతీయ పరిశ్రమలకు అలవాలమై, వేలకోట్ల పెట్టుబడులకు నిలయమై, 50 వేల మందికిపైగా నిరుద్యోగులకు జీవనాధారమై, భారతదేశంలో ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో అత్యుత్తమ ప్రత్యేక పారిశ్రామికవాడగా ప్రథమ స్థానంలో నిలిచి, అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. ప్రపంచ పారిశ్రామిక రంగంలో ప్రత్యేక గుర్తింపును సాధించి, పారిశ్రామిక అభివృద్ధికి దిక్సూచిగా మారింది.

1975 - 1978 మధ్య కాలంలో అరవపాళెం గ్రామం హైస్కూల్‌లో మా విద్యార్థి రవీంద్రబాబు. 45 సంవత్సరాల తరువాత ఇటీవల శ్రీసిటీలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మా రవిని చూసినప్పుడు ఆనందం కలిగింది. అతనిలోని ఔన్నత్యము, ఉన్నత వ్యక్తిత్వము, ఎదిగే కొద్దీ ఒదగాలన్న తత్వము, నిగర్విగా, నిరాడంబరంగా తాననుకున్నది సాధిస్తున్న పరిపూర్ణ పరిపక్వత కలిగిన వ్యక్తిగా ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్న రవికి గురువులమైనందుకు గర్వపడ్డాం.

రవి బృందం చేస్తున్న అకుంఠిత దీక్షకి, వారి దృఢ సంకల్పానికి, శ్రమకి, దూరదృష్టికి, 'నభూతో నభవిష్యతి' అన్న విధంగా అనితరసాధ్యమైన ప్రగతి సాధిస్తున్న శ్రీసిటీ నిదర్శనం అని భావిస్తున్నాం. చిన్నతనం నుండే చురుకైన విద్యార్థిగా తన ప్రగతికి బంగారు బాటలు వేసుకున్న మా ప్రియశిష్యుడు రవిబాబుకి 'విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం' గౌరవ డాక్టరేట్ అందించిన సందర్భంగా మా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. రవి భవిష్యత్తులో ఇంకా ఘన విజయాలు సాధించాలని, విజయపథంలో దూసుకుపోయి అపార కీర్తిప్రతిష్టలతో చిరకాలం చిరంజీవిగా ఉండాలని మనసారా దీవిస్తున్నాం.

ఆశీస్సులతో... రవి ఆచార్యులు
తూపిలి చంద్రారెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్
తూపిలి లక్ష్మీరాజ్యం, రిటైర్డ్ డి.ఇ.ఓ

## అవును.. ప్రభుత్వాలు కంపెనీగా అవతరిస్తున్నాయి!

గత వారం మన 'లాయర్'లో మొదటిపేజీలో మంచి విశ్లేషణ రాశారు. 'లాయర్' చెప్పినట్లుగా ప్రాంతీయపార్టీలు అధికారం చేపట్టిన అన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలు కంపెనీలలాగే నడుస్తున్నాయి. నిజానికి చెప్పాలంటే వరసగా తిరుగులేని మెజారిటీతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ కూడా కేంద్ర ప్రభుత్వాన్ని అలాగే నడుపుతోందని నా భావన. వాళ్ళని కూడా ఎవరైనా ఎదిరిస్తే వాళ్లని బెదిరిస్తారన్న సంగతి పలు సంఘటనలు మనకు రుజువు చేశాయి. మన జిల్లా వాడైనా జీవీకే రెడ్డికి చెందిన ముంబై విమానాశ్రయం ఆయన నుండి లాక్కొని అదానీలకు కట్టబెట్టిన ఉదంతమే అందుకు పెద్ద ఉదాహరణ. అసలు రాజకీయాలే కలుషితమైపోయాయి. అందరూ అందరే...!

- కె.వేణుగోపాల్‌రెడ్డి, హైదరాబాదు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## పదవుల పంపకంలో...
# పరువు పోగొట్టుకుంటున్న వైసీపీ!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ పదవుల పంపకంలో మరోసారి తప్పులో కాలేశారా అనిపిస్తుంది. ఏప్రిల్ నెలలో జరిగిన మంత్రివర్గ విస్తరణలో సీనియర్లను, పార్టీ విధేయులను పక్కనపెట్టి, ఆయనను తీవ్రంగా విమర్శించిన విడదల రజని లాంటి వలస పక్షులను అందలం ఎక్కించారన్న విమర్శల నుండి జగన్ ఇంకా బయటపడలేదు. ఇదే తరుణంలో ఇప్పుడు కొత్తగా ఖాళీ అవుతున్న రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక విషయంలో కూడా ఆయన మరో తప్పిదం చేశారు. తెలంగాణ బీసీ నాయకుడు ఆర్.కృష్ణయ్యకి ఆంధ్ర నుండి ప్రాధాన్యతనిచ్చి రాజ్యసభకు పంపడం వెనుక పెద్దకారణమే ఉంది. తన వ్యక్తిగత ప్రయోజనాలను, ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు కుండమార్పిడి ఒప్పందంతోనే ఈ నియామకం జరిపినట్లు స్పష్టమైపోతుంది. ఆంధ్రాలో తెలంగాణ నాయకుడు ఆర్.కృష్ణయ్యకి అవకాశం కల్పించారు జగన్. అందుకు ప్రతిఫలంగా తనకు అత్యంత సన్నిహితుడైన హెటెరో డ్రగ్స్ అధినేత పార్ధసారథిరెడ్డిని తెలంగాణ నుండి రాజ్యసభకు పంపాలని తెలంగాణ సీఎం కేసీఆర్‌తో జగన్ ఒప్పందం చేసుకున్నట్లుంది. ఈ విషయంలో ఒక రకంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలను జగన్ అవమానించారనే అనుకోవాలి. ఈ నియామకంతో ఆంధ్ర రాష్ట్రంలో రాజ్యసభకు వెళ్లగలిగే బీసీ నాయకులే లేరన్న సందేశం ఇచ్చినట్లయింది. ఒకవైపు బీసీల కోటాలో బీద మస్తాన్‌రావుకి రాజ్యసభ సభ్యత్వ అవకాశం కల్పిస్తూనే, మరోవైపు తెలంగాణకు చెందిన వివాదాస్పద బీసీ నాయకుడికి రాజ్యసభ కిరీటం పెట్టడం, మస్తాన్‌రావుని బీసీ నాయకుడిగా గుర్తించలేకపోవడమే అన్న భావన కలుగుతుంది. ఖాళీ అవుతున్న నాలుగు సీట్లలో రెండు తెలంగాణ వారికి కేటాయించడం వల్ల జగన్ పార్టీకీ, ఆంధ్ర ప్రజలకు కలిగే ప్రయోజనం నామ మాత్రమే. నామినేటెడ్ పదవుల పంపకం, మంత్రివర్గ విస్తరణ, రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక... ఇలా అన్ని పదవుల పంపకాలలోనూ వైసీపీ అభాసుపాలవుతూనే ఉంది. పరువు పోగొట్టుకుంటోంది.

- యం.చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

# చిరస్మరణీయోత్సవం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం



**• నెల్లూరుకు వచ్చి వెళ్లిన గవర్నర్ • విద్యార్థినీవిద్యార్థులకు డిగ్రీల బహుకరణ • రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి సందర్శన**

*రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఈనెల **24**న నెల్లూరుకు వచ్చి వెళ్ళారు. విక్రమసింహపురి విశ్వవిద్యాలయం(విఎస్‌యు) **6,7**వ స్నాతకోత్సవాల్లో గవర్నర్ పాల్గొనడంతో విఎస్‌యులో సంబరాలు మిన్నంటాయి. గవర్నర్ చేతులమీదుగా పట్టాలు, బంగారుపతకాలు అందుకున్న ప్రతిభామూర్తుల ఆనందానికి అవధుల్లేవు. ఈ వేదికపైనే శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి గవర్నర్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడంతో పరిశ్రమల వర్గాల్లోనూ సంతోషం వెల్లువెత్తింది. అనంతరం గవర్నర్ నగరంలోని పొదలకూరురోడ్డులో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించి **10** కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన రేడియో థెరపీ బ్లాక్–2 భవనానికి ప్రారంభోత్సవం చేశారు. అక్కడ ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఉదయం **11.25** గంటలకు నెల్లూరుకు వచ్చిన గవర్నర్ సాయంత్రం **4.25** గంటలకు నెల్లూరు నుంచి తిరిగి విజయవాడకు బయలుదేరి వెళ్ళారు. గవర్నర్ రాకతో అటు విఎస్‌యు అధికారులు, ఇటు జిల్లా ఉన్నతాధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, సిబ్బంది అందరూ ఏర్పాట్ల పర్యవేక్షణలో తలమునకలయ్యారు. గవర్నర్ పర్యటనకు ఎలాంటి అవరోధాలు లేకుండా పోలీసుల గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.*

అదిగో ఇదిగో అనుకుంటున్న విఎస్‌యు స్నాతకోత్సవ వేడుకలు చాన్సలర్ హోదాలో విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సమక్షంలో ఎంతో కోలాహలంగా జరిగాయి. ప్రత్యేక హెలికాప్టర్‌లో గవర్నర్ నెల్లూరుకు వచ్చారు. విఎస్‌యు హెలిప్యాడ్ వద్దకు రాగానే గవర్నర్‌కు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ కెవిఎన్

11లో



## గౌరవ్ డాక్టరేట్ అందుకున్న

## పరిశ్రమల వారధి - ప్రగతి సారధి

# డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి



సంచలనాత్మక పారిశ్రామికవాడగా 'శ్రీసిటీ' ప్రత్యేక పారిశ్రామికవాడకు గుర్తింపు తెచ్చిన యువ పారిశ్రామికవేత్త శ్రీసిటీ సహ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి. ఇప్పుడాయన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిగా మారారు. ఆయన సాధించిన పారిశ్రామిక ప్రగతికి, సాధించిన అనూహ్య విజయానికి, నిరంతరం సాగిస్తున్న పారిశ్రామిక యజ్ఞానికి, సామాజిక బాధ్యతతో చేస్తున్న సమాజ సేవకి గుర్తుగా 'విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం' రవిరెడ్డిని గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. మే24 మంగళవారం ఉదయం నెల్లూరులో జరిగిన యూనివర్సిటీ 6–7 స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ బిశ్వభూషణ్ హరిచందన్ రవిసన్నారెడ్డికి డాక్టరేట్ అందించారు.

### ఈ పురస్కారం నా బాధ్యతలను మరింత పెంచింది

**- డాక్టర్ రవిసన్నారెడ్డి**

అంతర్జాతీయ పరిశ్రమల వాడగా, భావితరాల భవిష్యత్తుకి నీడగా తాము స్థాపించిన శ్రీసిటీ ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించడానికి నిరంతరం శ్రమిస్తున్నామని, ఇలాంటి తరుణంలో తనకు ఈ డాక్టరేట్ రావడం తన బాధ్యతలను మరింత పెంచిందని రవిరెడ్డి అన్నారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సొంత గ్రామానికి దగ్గరలో తన జన్మభూమిపై తన బంధుమిత్రులు, ఆప్తులు, ఆత్మీయుల మధ్య ఈ పురస్కారాన్ని అందుకోవడం తనకు ఎనలేని ఆనందాన్నిచ్చిందని చెప్పారు. భావిభారత పౌరులను సాంకేతిక సారథులుగా, సమర్ధవంతమైన యువశక్తిగా తీర్చిదిద్దడానికి శ్రీసిటీ తనకు చేతనైన సహకారం అందించడానికి సర్వదా సిద్ధంగా ఉంటుందన్నారు. తనకు అన్ని విధాలా సహకరిస్తున్న తన ఆప్తమిత్రుడు శ్రీనిరాజుకి, తమ సిబ్బందికి, ప్రభుత్వాధినేతలకి, పరిశ్రమల స్థాపనకోసం తమ భూములను సహృదయంతో అందించిన రైతు కుటుంబాలకు, అధికారులకి కృతజ్ఞతలు తెలియజేశారు. తనను ఈ పురస్కారం కోసం ఎంపిక చేసిన యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ మరియు రిజిస్ట్రార్‌లకి, గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిన గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కి ధన్యవాదాలు తెలిపారు. తమ సంస్థపై విశ్వాసంతో ఖండాంతరాలు దాటి కోట్లరూపాయలు పెట్టుబడిగాపెట్టి శ్రీసిటీ అభివృద్ధికి తోడ్పడుతున్న అంతర్జాతీయ సంస్థల యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు జన్మనిచ్చిన అమ్మానాన్నలకు, తీర్చిదిద్దిన గురువులకు, తనను వెన్నంటి నడిపిస్తున్న తన సతీమణికి ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు.

### మీరూ నాలా ఎదగొచ్చు....

విశ్వవిద్యాలయం 6 – 7 స్నాతకోత్సవాలలో పట్టాలు పుచ్చుకున్న యువతకి శుభాకాంక్షలు తెలిపారు రవిరెడ్డి. ఒక మారుమూల పల్లెలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన తన చదువంతా ప్రభుత్వ విద్యాలయాలలోనే జరిగిందని అన్నారు. తన బాల్య విద్యాభ్యాసం తెలుగు మీడియంలోనే కొనసాగిందని తెలిపారు. బ్రతుకుదెరువు కోసం పాశ్చాత్య దేశాలకు వెళ్లినా, తాను మాతృదేశంపై ఉన్న అభిమానంతో ఈరోజు అదే పాశ్చాత్య దేశాల సంస్థలను మన దేశానికి రప్పిస్తున్నట్లు చెప్పారు. ఈరోజు డిగ్రీలు అందుకున్నవారంతా తనలా ఆలోచిస్తే ఎన్నో విజయాలను తమ సొంతం చేసుకోవచ్చని చెప్పారు. అబ్దుల్ కలాం చెప్పినట్లుగా కలలు కని, ఆ కలలు సాకారమయ్యేలా తపించాలని చెప్తూ విద్యార్థినీవిద్యార్థులలో స్ఫూర్తిని కలిగించారు. 'కష్టేఫలి' అన్న మాటలకు సజీవ సాక్ష్యంగా నిలచిన డాక్టర్ రవీంద్రబాబు సన్నారెడ్డికి 'లాయర్' అభినందనలు.




# స్విమ్మింగ్‌లో న్యాయశాఖ ఉద్యోగికి స్వర్ణం



శ్రీనివాసులును అభినందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని

ఇటీవల బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకోర్టు జూనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసులు అత్యుత్తమ ప్రతిభతో బంగారుపతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని ఈనెల 23న ఆయన్ను అభినందించి సన్మానించారు. త్వరలో ఆస్ట్రేలియాలో జరిగే స్విమ్మింగ్ పోటీలకు కూడా శ్రీనివాసులు అర్హత సంపాదించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, అంతర్జాతీయస్థాయిలోనూ విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు సివి నారాయణరెడ్డి, గిరిబాబు, ఎం.నర్సింహారావు, శివకుమార్, సురేష్, ఆ సంఘం రాష్ట్ర నాయకులు రవికుమార్, ఆర్‌వి రమణయ్య, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు చక్రవర్తి పాల్గొన్నారు.

### వైకాపా అరాచకాలకు..

# ప్రజలే గుణపాఠం చెప్తారు



కప్పిర రేవతిని పరామర్శిస్తున్న మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వైకాపా నాయకుల అక్రమాలు, అరాచకాలకు అడ్డేలేకుండా పోతోందని, మహిళలపై దాడులకు పాల్పడడం దారుణమని, ప్రజలే ఆ పార్టీకి తగు గుణపాఠం చెప్తారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వైకాపా వారి చేతిలో దాడికి గురై గాయపడి నెల్లూరు, ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి మహిళా నాయకురాలు కప్పిర రేవతిని ఈనెల 23న ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ తన భర్తను అన్యాయంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్ళిన విషయమై ఆమె ప్రశ్నిస్తే కొంతమంది మహిళలచేత ఆమెపై దాడిచేయించడం ఏమిటని, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు సక్రమంగా వృత్తిధర్మాన్ని నిర్వర్తించకపోవడం వల్లే వైకాపా నాయకులు ఇష్టంవచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. అధికారపార్టీ నాయకుల అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులకు దిగడం ఘోరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, కప్పిర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# లెక్కల మాష్టారుకు.. అబ్దుల్ కలాం అవార్డు



నెల్లూరులోని లిటిల్‌ఏంజెల్స్ స్కూల్‌కు చెందిన గణితశాస్త్ర ఉపాధ్యాయుడు రాజపుత్ర సుధీర్ డాక్టర్ ఏపిజె అబ్దుల్‌కలాం అవార్డు సాధించారు. ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షల్లో ఆయన ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. సెప్టెంబరు 5వ తేదీన హైదరాబాద్‌లో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు.




# నెల్లూరు కబుర్లు

### నేరాలకు పాల్పడితే..

# పీడీయాక్ట్ తప్పదు!



- జిల్లా ఎస్పీ

తరచూ నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదుచేయాలని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు పోలీసు అధికారులను ఆదేశించారు. ఈనెల 23న ఆయన జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సివిల్ వివాదాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించే వారిపట్ల కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే నాటుసారా తయారీపై, సారా క్రయవిక్రయదారులపై పీడీయాక్ట్‌లు, సస్పెక్ట్‌షీట్‌లు నమోదు చేయాలని చెప్పారు. నాటుసారా తయారీదారులకు సహకరిస్తూ అందుకవసరమైన బెల్లం విక్రయాలకు పాల్పడుతున్న వ్యాపారులపై నిఘా ఉంచి వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెంచాలన్నారు.

# క్రీడా ప్రతిభకు ప్రతీక.. వసుంధర



వయస్సుతో నిమిత్తం లేకుండా కళా రంగంలో, క్రీడారంగంలో ఎన్నో అవార్డులు, రివార్డులు, పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించిన జె.వసుంధరను ఉక్కు మహిళ అంటూ పి.ఎం.పి జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ కొనియాడారు. ఈనెల 24న వేదాయపాలెంలోని జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బెంగుళూరులో ఈనెలలో 11 నుండి 14 వరకు జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్‌లో 5 పతకాలు సాధించిన ఆమెను ఆయన అభినందించారు. క్రీడలతో పాటుగా, భరతనాట్యంలో కూడా సంచలనాలు సృష్టిస్తోందని, అదేవిధంగా సేవారంగంలో కూడా ఉంటూ బాధితులను ఆదుకున్న వసుంధర నేటి యువతరానికి ఆదర్శమని కొనియాడారు. ఈ సందర్భంగా రూఢ్స్ చారిటబుల్ ట్రస్ట్, పి.ఎం.పి అసోసియేషన్లు ఆమెను ఘనంగా సత్కరించాయి. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్, పి.ఎం.పి. జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, రూఢ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పీఎం.పి నాయకులు జి.శేషయ్య, ఉపాధ్యాయులు షేక్ సుభాహాన్, రాజేష్, మహిళా పోలీసులు షేక్ షాహినా, షేక్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి దిశ-దశ నిర్దేశించేవి స్థానిక పత్రికలే

సమాజానికి దిశ దశను నిర్దేశించేవి స్థానిక పత్రికలేనని ఏపీయూడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి జయప్రకాశ్ అన్నారు ఈనెల 24న ఆయన నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన స్టేట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్(సామ్నా) కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. స్థానిక పత్రికల ప్రాధాన్యతను ఆయన వివరించారు. అనంతరం సామ్నా అసోసియేషన్‌కు నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎస్ రామారావు, అధ్యక్షులుగా సర్వేపల్లి రామ్మూర్తి, ఉపాధ్యక్షులుగా తిలక్, నరేంద్ర, రవీంద్రరెడ్డి. ప్రధాన కార్యదర్శిగా హనోక్, సహాయ కార్యదర్శులుగా ఏ.వెంకటేశ్వర్లు, రావూరి రమేష్‌బాబు. కోశాధికారిగా వేలూరు సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బుజ్జిరెడ్డి, కమిటీ సభ్యులుగా సయ్యద్ అక్మల్, ఎస్.సురేష్‌కుమార్, వి.వినయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాటేటి రత్నప్రసాద్ పర్యవేక్షించారు. సామ్నా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విజయ్ కుమార్, ఐని మెంబర్ టి.గోపినాథ్, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.




# బ్యాడ్మింటన్ అభివృద్ధికి కృషిచేస్తా

### ముక్కాల ద్వారకానాథ్



ఏపి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ముక్కాల

ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నెల్లూరీయుడు, నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ ఇటీవల విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు

# అక్రమ లేఅవుట్లపై విచారణ చేయించండి

### --- కలెక్టర్‌కు కోటంరెడ్డి శీనయ్య వినతి ---



నెల్లూరులో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నా నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ(నుడా) పట్టించుకోవడం లేదని, టిడిపి నగర నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. అక్రమ లేఅవుట్లపై వెంటనే విచారణ జరిపించాలంటూ పలువురు నాయకులతో కలసి ఆయన కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుకు ఈనెల 23న వినతిపత్రం సమర్పించారు. నుడాలో జరుగుతున్న అవినీతిని సహించలేకనే ఆ సంస్థ ఛైర్మన్ ముక్కాల ద్వారకనాథ్ నుడాకు దూరంగా ఉంటున్నారని, ప్రతి నెలా జరపాల్సిన నుడా సమావేశం కూడా జరగడం లేదని ఆయన పేర్కొన్నారు. పెన్నా పొర్లుకట్టను ఆక్రమించి వేసిన అక్రమ లేఅవుట్లపై నుడా అధికారులకు వారం రోజుల కిందటే ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అక్రమ లేఅవుట్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# డిసిసి ఆధ్వర్యంలో.. రాజీవ్ వర్ధంతి



దివంగత భారత ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం ఇటీవల నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక ఇందిరాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉడతా వెంకట్రావు, ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ మాట్లాడుతూ దేశంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్ల మాత్రమే అభివృద్ధి సాధ్యమని, దేశం కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసిన గాంధీ కుటుంబంతో కలిసి కాంగ్రెస్ పార్టీని గెలిపించడం కోసం ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సిటీ కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ ఫయాజ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు ఏటూరు శ్రీనివాసులురెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కొండా అనిల్‌కుమార్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌బాబు, మైనారిటీ అధ్యక్షుడు షేక్ అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్.. నూతన కార్యవర్గం

నెల్లూరులోని ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌కు ఇటీవల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. నెల్లూరు క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా గుండ్లపల్లి శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారిగా అద్దేపల్లి భాస్కరరావు ఎన్నికైనట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ కెవి చలమయ్యతో పాటు అయితా రామచంద్రరావు, ఎన్‌వి కృష్ణయ్య, టి.ప్రకాశరావు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## విజయాశీస్సులు



ఈ నెల 25వ తేదీన రాజ్యసభకు నామినేషన్ వేస్తున్న సందర్భంగా విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం వేద పండితుల చేత వేద ఆశీర్వాదం పొందుతున్న వి.విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు. ఈ సందర్భంగా వారు ఆ కనకదుర్గమ్మ తల్లి కటాక్షం తెలుగు ప్రజలందరికీ ఉండాలని ప్రార్థించారు.

# గడప గడపకు మంత్రి కాకాణి

రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈనెల 22, 23 తేదీల్లో సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని, పొదలకూరు మండలం, విరువూరు గిరిజన కాలనీలో జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి వీధి తిరుగుతూ, ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ ఫలాలు వారికి ఏవిధంగా అందుతున్నాయో తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసిన ఉత్తరాన్ని, బుక్‌లెట్‌ను వారికి అందజేశారు.



### మూగజీవాలకు అండగా నిలుద్దాం :

మూగజీవాలకు అండగా నిలవాలన్న సంకల్పంతో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డాక్టర్ వైయస్సార్ సంచార పశు వైద్య శాలలను అందుబాటులోకి తెచ్చిందని మంత్రి కాకాణి అన్నారు. ఈనెల 22వతేది సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలంలోని, విరువూరు గ్రామంలో ఆయన డా. వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ మొబైల్ వెటర్నరీ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోల్ ఫ్రీ నెంబర్ 1962 ద్వారా పశు అనారోగ్య సమాచారం తెలిస్తే వెంటనే రైతు ఇంటికి సంచార పశు వైద్య శాల వారు వెళ్లి వైద్య సేవలందిస్తారన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో ఈ మొబైల్ అంబులెన్స్‌లు ల్యాబరేటరీ క్లినిక్స్‌తో పనిచేస్తాయని, అంబులెన్స్‌లో బరువున్న మూగజీవాన్ని తరలించేందుకు వీలుగా హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జె.డి మహేశ్వరుడు పాల్గొన్నారు.



## అమెరికాలోని పలు నగరాల్లో..

# టిటిడి వారిచే.. శ్రీవారి కల్యాణోత్సవాలు

### జూన్ 18 నుంచి ప్రారంభం



టిటిడి ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి

అమెరికాలోని పలు నగరాల్లో ఉంటున్న శ్రీవారి భక్తులకు స్వయంగా ఆ తిరుమలేశుని కల్యాణోత్సవాన్ని తిలకించే భాగ్యాన్ని కలిగించేందుకు అటు ప్రభుత్వం, టిటిడితో పాటు ఆయా ప్రాంతాల్లోని ధార్మికసంఘాలు కృషి చేస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపిఎన్ఆర్‌టిఎస్) సారధ్యంలో అమెరికాలోని పలు నగరాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు భక్తిపూర్వకంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సన్నాహాలు చేస్తోంది. ఆయా నగరాల్లోని ధార్మికసంస్థలు, సేవా సంస్థల కార్యనిర్వాహక వర్గాలు పెద్దఎత్తున అందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ వేడుకల కోసం తిరుమల నుంచి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారి మూర్తులను అమెరికాకు తీసుకువెళ్తారు. తిరుమల శ్రీవారి దేవస్థానం నుంచే అర్చకులు, వేద పండితులు కూడా స్వామివారితో వెళ్లి వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం అమ్మవార్ల సమేత శ్రీవారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. తిరుమల నుంచి శ్రీవారి లడ్డూప్రసాదాన్ని తీసుకువెళ్లి భక్తులకు అందజేస్తారు. జూన్ 18న శాన్‌ఫ్రాన్సిస్కో, 19న సియాటెల్, 25న డల్లాస్, 26న సెయింట్ లూయిస్, జులై 2న న్యూఆర్లెన్స్, జులై 3న వాషింగ్టన్‌డిసిలతో పాటు మరికొన్ని నగరాల్లో కూడా తిరుమలేశుని కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కళ్యాణోత్సవ కార్యక్రమాలను స్థానికంగా సమన్వయపరచి అక్కడ ఏర్పాట్లను పరిశీలించే బాధ్యతను మన నెల్లూరీయుడు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి కోర్శపాటికి అప్పగించారు. ఈ అవకాశాన్ని అమెరికాలోని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానాల వారు కోరుతున్నారు. ఈ కళ్యాణోత్సవ కార్యక్రమాలన్నింట్లోనూ దేవస్థానాల ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి, కొంతమంది కార్యవర్గ సభ్యులు పాల్గొననున్నారని సమాచారం.




# సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు
బంధుజనప్రియులు, సమతావాది

## పూండ్ల చెంచురెడ్డి గారు

పరమపదించి తేది. 27.05.22 నాటికి
ముప్పైనాలుగు సంవత్సరాలు నిండుతాయి.

ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...

భార్య :
లేట్ పూండ్ల కామేశ్వరమ్మ

కుమారులు :
డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి
పూండ్ల వెంకురెడ్డి
మరియు
కుటుంబసభ్యులు

# మంత్రి అప్పలరాజును కలసిన.. పేర్నాటి



గూడూరు నియోజకవర్గంలోని కోట, చిట్టమూరు, చిల్లకూరు మండలాల తీరప్రాంత గ్రామాల ఆక్వా రైతులు మరియు మత్స్యకారులతో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఇటీవల విజయవాడలోని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు, చిట్టమూరు, కోట మండలాల పరిధిలోని తీరప్రాంత గ్రామల ఆక్వా రైతులకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కోట మండలం, కొత్తపట్నం గ్రామ పంచాయతీలోని గోవిందపల్లిపాలెం మత్స్యకారుల ఇబ్బందులు తీర్చడానికి అక్కడ ఎస్కేప్ కెనాల్ దగ్గర హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. సముద్ర ముఖద్వారంలో పూడిక తీయించాలని, గోవిందపల్లి పాలెంలో అసంపూర్తిగా ఉన్న జెట్టీని పూర్తి చేయాలని, గోవిందపల్లిపాలెంలో సి.సి రోడ్లు నిర్మించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ముత్యాలమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



ఈ నెల 24వ తేదీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇ.సుజాత, గూడూరు జెఎంఎఫ్‌సి కోర్టు మేజిస్ట్రేట్ అశోక్‌కుమార్‌లు చిల్లకూరు మండలం, తూర్పుకనుపూరు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. దేవాలయ ఛైర్మెన వేమారెడ్డి మురళీమోహన్ రెడ్డి, కార్యనిర్వాహణాధికారి జనార్థన్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డిలు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు.

# వన్‌టౌన్ స్టేషన్‌లో ఎస్పీ 'స్పందన'



తిరుపతి జిల్లా గూడూరు వన్ టవున్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పాల్గొని అర్జీలు స్వీకరించారు. తొలుత ఎస్పీకి గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గూడూరు రూరల్, పట్టణ సి.ఐలు శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరమ్మ, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

# డాక్టర్ రోహిణి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి

ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు, మహిళా సేవకురాలు డాక్టర్ చెరుకూరు రోహిణి జన్మదినాన్ని ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తూ, ఉచిత వైద్యశిబిరాలు, విద్యార్థుల చదువులకు, విద్యాసామాగ్రికి ఆర్థికసాయం అందించడం, మహిళా ఆర్థికాభివృద్ధికి సేవా కార్యక్రమాలు, పేద మహిళలకు కుట్టుమిషన్‌లు అందించడంలో ఆమె ఎంతగానో కృషి చేశారని కొనియాడి, పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్, రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో టెక్‌వ్యూహ-2022



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో సిఎస్ఇ విభాగం సిఎస్ఐ, ఐఇఇఇ-ఎస్‌బిల సహకారంతో ఈనెల 21న టెక్‌వ్యూహ-2022 కార్యక్రమం నిర్వహించారు. సిఎస్ఇ విభాగాధిపతి డా.ఏ.రాజశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ డా.ఏ.నారాయణరావు, డి.ఎస్తేర్‌రాణి, సిహెచ్ విష్ణువర్థన్‌రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, వెబ్ డెవలప్‌మెంట్, ఏఐటి ఎక్స్‌పో, స్పాట్ ఈవెంట్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీలో ఇంటర్న్‌షిప్ కోర్సు :




ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నాలజీ ఇంటర్న్‌షిప్ కోర్సు ప్రారంభమైంది. ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థల సలహాదారు, ప్రఖ్యాత విద్యాసంస్థ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (హైదరాబాద్) గెస్ట్ లెక్చరర్ వైఎస్సార్ రాజీవ్ వర్చువల్ విధానంలో ఈ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్‌కు వచ్చే ఎనిమిదేళ్లలో ఇ.వి రంగంలో మంచి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ ఇంటర్ ప్రిన్యూర్ షిప్ అంచనా ప్రకారం 2030 నాటికి ఒక్క విద్యుత్ వాహనాల రంగంలోనే మనదేశంలో ప్రత్యక్షంగా, సుమారు కోటి ఉద్యోగాలు వస్తాయన్నారు. విద్యార్థులకు జాతీయ విద్యావిధానంలో భాగంగా ఇలాంటి కోర్సుల ఆవశ్యకత ఎంతైనా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల డైరెక్టర్ డా. విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల పనితీరును మెరుగుపరచేందుకు బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, మెటీరియల్స్ డెవలప్‌మెంట్ రంగాల్లో పరిశోధన అవసరం ఎంతైనా ఉందని విభాగాధిపతి డా.సిహెచ్ఆర్ విక్రమ్‌కుమార్ తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా భువనేశ్వర్‌కి చెందిన ఎస్‌కెవై రైడర్ ఇన్‌స్టిట్యూట్ వారి సహకారంతో సిక్స్‌సీటర్ ఎలక్ట్రికల్ వెహికల్‌ను తమ కళాశాలలో స్వయంగా తయారు చేస్తారని కోర్సు కోఆర్డినేటర్ డా. వై.అశోక్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు సిద్ధార్థ్ పట్నాయక్, జ్యోతి రంజన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## యాంటీ టెర్రరిజం డే :



యాంటీ టెర్రరిజం డే సందర్భంగా ఈనెల 21న విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు జరిగాయి. ఇన్‌చార్జి డైరెక్టర్ డా.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగ్రవాద కార్యకలాపాలు దేశాభివృద్ధికి విఘాతం కల్పిస్తాయని, విద్యార్థులు ఉగ్రవాదానికి దూరంగాఉండాలని చెప్పారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులందజేశారు. ఎస్ అండ్ హెచ్ విభాగం అధిపతి డా.సి.రవీంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా.సి.ఉదయ కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# టవర్ క్లాక్ గతి.. అంతేనా?



గూడూరుకే తలమానికంగా ఎళ్ళ తరబడి గూడూరుకు గుర్తుగా ఉన్న టవర్ క్లాక్‌ను పడగొట్టి రెండు సంవత్సరాలు కావస్తున్నా, దాని స్థానంలో నూతన టవర్‌ను ఇంకా ఏర్పాటు చేయలేదని సిఐటియు సభ్యులు జోగి శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గూడూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ టవర్‌క్లాక్‌ను ఎందుకు కూల్చారో, ఎవరు కూల్చారో కూడా తెలియడం లేదని, ప్రజాధనాన్ని నాశనం చేస్తున్నారన్నారు. నాయకులు గాని, అధికారులు గాని రెండు సంవత్సరాలు దాటినా ఈ టవర్‌క్లాక్‌ను పట్టించుకోకపోవడం దారుణమని, అదే స్థానంలో మళ్ళీ టవర్ క్లాక్ నిర్మించేంతవరకు తాము పోరాడతామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యస్.యాదగిరి, సి.పి.ఎం గూడూరు టౌన్ కార్యదర్శి పి.మణి, ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గూడూరు కోనేటిమిట్టలోని శ్రీ కోదండరామాంజనేయ స్వామి దేవాలయంలో ఇటీవల మూడురోజుల పాటు 'సుందరకాండ' ప్రవచనం చేసిన అవధాని కోట రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.ఆర్.రెడ్డి.



# రైల్వే ప్రయాణీకులు జాగ్రత్తలు పాటించాలి

రైళ్లలో ప్రయాణించేటప్పుడు మహిళలు జాగ్రత్తలు పాటించాలని ఆర్పీఎఫ్ సి.ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గూడూరు రైల్వేజంక్షన్‌లో ఈ నెల 23వ తేదీ మహిళా ప్రయాణీకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వే పోలీసులు సికెఎన్ రావు, చంద్రశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై దాడులు దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు మహిళా నాయకురాళ్ళు

రాష్ట్రంలో మహిళలపై దాడులు చేయడం సిగ్గుచేటని, వైకాపా నేతలు చేస్తున్న దాడులకు తగిన మూల్యం చెల్లించుకుంటారని తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నెల్లూరు నగర తెలుగుమహిళా అధ్యక్షురాలు రేవతిపై భౌతికదాడి చేయడం బాధాకరమని, నెల్లూరు పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, పార్టీ కార్యాలయానికి నిప్పుపెట్టి ఫర్నిచర్ ధ్వంసం చేయడం రాష్ట్రంలో రౌడీల పాలనకు నిదర్శనమని ఆమె విమర్శించారు. నాయకులు మట్టం శ్రావణి, గుండాల భారతి, మధవి, శ్యామల తదితరులు పాల్గొన్నారు. కాగా, మహిళలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదని, రాబోవు రోజుల్లో వైకాపా నాయకులకు తగిన బుద్ధి చెబుతామని మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# రాపూరు ఆసుపత్రి పనులను పరిశీలించిన ఆనం



మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఇటీవల రాపూరులోని 50 పడకల ఆసుపత్రి భవనం నిర్మాణ పనులను సంబంధిత అధికారులు ఇంజనీరింగ్ సిబ్బంది మరియు వర్క్ ఏజెన్సీ వారితో కలిసి ఇటీవల పరిశీలించారు. నాబార్డు నిధుల ద్వారా రాపూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు 3 కోట్ల రూపాయలతో అవసరమైన భవనాలు నిర్మిస్తున్నామని ఆనం ఈ సందర్భంగా చెప్పారు. అదేవిధంగా రాపూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు మరో 22 లక్షల రూపాయలతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందించే డాక్టర్లు, సిబ్బంది కొరతను త్వరలో తీరుస్తామని ఆయన తెలిపారు.

# సిపిఎస్ రద్దు కోసం.. టీచర్ల ధర్నాందోళన

సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే పునరుద్ధరించాలని కోరుతూ నెల్లూరులో ఈనెల 23న బహుజన ఉపాధ్యాయ సంఘం (బిటిఎ) ప్రతినిధులు ధర్నాందోళన చేశారు. నగరంలోని కలెక్టరేట్ వద్ద జరిగిన ఈ ఆందోళనలో బిటిఎ గౌరవాధ్యక్షులు పి.చిన్నయ్య, గౌరవ సలహాదారు పిజిడి కృపాల్, సంఘం నాయకులు ఎంఆర్ చక్రవర్తి, బిసి చెంచయ్య, జి.శ్రీనివాసులు, చిట్టేటి రమేష్ తదితరులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం కొత్తగా రూపొందించిన విధానంలో ఉపాధ్యాయులకు సముచితమైన సౌలభ్యాలు లేవన్నారు. రాజస్థాన్ వంటి పెద్ద రాష్ట్రాల్లో కూడా సిపిఎస్‌ను రద్దుచేశారని గుర్తుచేశారు.

# నకిలీ పురుగుమందులను నివారించండి

**- కలెక్టర్‌కు మిడతల రమేష్ వినతి**

జిల్లాలో నకిలీ పురుగుమందులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, పంటలను ఆశించే క్రిమికీటకాల నివారణకు బ్రాండెడ్ మందులనే వాడేలా చూడాలని బిజెపి నాయకుడు మిడతల రమేష్ ఈనెల23న కలెక్టర్‌ను కోరారు. స్పందన కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. చైనా నుంచి దిగుమతి చేసుకునే ప్రమాదకరమైన రసాయనాలతో తయారుచేసే నకిలీమందులు ప్రమాదకరమని, ఈ విషయంపై రైతులకు అవగాహన కలిగించాలని, ఆర్‌బికెల ద్వారా నాణ్యమైన పురుగుమందులను పంపిణీ చేయాలని ఆయన కోరారు.

### పోలేరమ్మతల్లికి..

# ప్రత్యేక పూజలు

సీతారామపురం మండలంలోని బెడుసుపల్లి గ్రామంలో కొలువైవున్న గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారికి ఆలయ అర్చకులు ఈనెల 22న ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో అమ్మవారి ఆలయం వద్దకు వెళ్ళి పొంగళ్ళు వండి నైవేద్యం సమర్పించుకున్నారు. శ్రీరామనవమి ఉత్సవాల తర్వాత అమ్మవారికి పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. అనంతరం గ్రామస్తులంతా రామాలయం వద్ద సామూహిక భోజనాలు చేశారు. నిర్వాహకులు డా. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేడుకగా ఈ కార్యక్రమాలు జరిగాయి.

# లోకేష్‌తో.. అజీజ్ భేటీ



టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో టిడిపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ భేటీ అయ్యారు. ఈనెల 23న ఆయన అమరావతిలో లోకేష్ నివాసంలో కలిసి శాలువతో సన్మానించారు. అనంతరం జిల్లా రాజకీయ పరిస్థితులను, అధికారపార్టీ పెడుతున్న ఇబ్బందులను ఆయన లోకేష్‌కు వివరించారు. వైకాపా తీరును నిరసిస్తూ జిల్లాలో టిడిపి ఆధ్వర్యంలో జరుగుతున్న 'బాదుడే బాదుడు' కార్యక్రమాన్ని తాము ఎలా నిర్వహిస్తున్నామో తెలిపారు.

# జొన్నవాడ దేవాలయానికి లక్ష విరాళం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో వెలసివున్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయానికి అమెరికాలో ఉంటున్న భక్తులు కాసుఖేల సీతాపతి, గాయత్రి దంపతులు ఇటీవల లక్షా నూటపదహారు రూపాయలను ఆన్‌లైన్ ద్వారా విరాళంగా అందజేశారని ఆలయ ఇ.ఓ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా దాతల పేరుమీద ఆలయంలో పూజల చేయించామని, ఆ మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చుచేస్తామని ఆయన చెప్పారు.

## ఉత్సవ గొడుగుల వితరణ

జొన్నవాడ ఆలయంలో ప్రస్తుతం ఎంతో వైభవంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నరసింహకొండ గ్రామానికి చెందిన భక్తులు పెనుబాక శ్రీనివాసులురెడ్డి-వసుమతి, దగ్గుమాటి శ్రీకాంత్‌రెడ్డి, రూపేష్‌రెడ్డిలు ఈనెల 23న రెండు ఉత్సవ గొడుగులను ఆలయానికి బహుకరించారు. నిర్వాహకులు దాతలకు ఆలయంలో ప్రత్యేకపూజలు చేయించి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఇఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి సభ్యుడు శివకుమార్ పాల్గొన్నారు.

# శ్రమజీవుల పేర్లు 'ఇ-శ్రమ'లో చేర్చండి

నిరుపేద కూలీల పేర్లను ఈ-శ్రమ పోర్టల్‌లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈనెల 23న ఆయన వెంకటాచలం మండలం చెముడుగుంట గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ-శ్రమ పోర్టల్ లో వీలైనంత ఎక్కువ మంది కూలీలను ఉచితంగా నమోదు చేయడం వల్ల వారికి ప్రభుత్వం నుండి బీమా సౌకర్యంతో పాటు పలు రకాల ప్రయోజనాలు లభిస్తాయన్నారు. ఈ విషయమై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆ ప్రాంతంలో పేదల గృహనిర్మాణాల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనేక ఇళ్ళ నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇకనైనా అధికారులు, సిబ్బంది శ్రద్ధ వహించి ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట నెల్లూరు ఆర్డీఓ శ్రీ పి కొండయ్య తహసిల్దార్ ప్రసాద్, ఇఓఆర్‌డి రమేష్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### భవన నిర్మాణాలపై..

# పన్ను పెరిగింది

ఇప్పటికే అన్ని రకాల ధరలు, కరెంటు చార్జీలు వగైరాలన్నీ భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో ఇకనుంచి భవన నిర్మాణాలపై కూడా పన్ను పెరుగుతోంది. జూన్ నెల నుంచి ఈ పన్ను పెరుగుతుందని, ప్రస్తుతం చదరపు గజానికి 1140 రూపాయలున్న పన్ను జూన్ 1 నుంచి 1200 రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చిందని జిల్లా రిజిస్ట్రార్ ఆళ్ళ బాలాంజనేయులు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ పెరిగిన పన్ను అమల్లోకి వస్తుందని తెలిపారు.

# శ్రీ షిరిడీనాథుని సేవలో తరిస్తున్న.. చిల్డ్రన్స్‌పార్క్ 'శ్రీ సాయి సదన్'

*సాయిబాబా.. అంటే పిలిచిన పలికే దైవం అనేవిషయం అందరికీ తెలిసిందే. ఏ కష్టమొచ్చినా నష్టమొచ్చినా..'బాబా నీవే దిక్కు'ని ఆర్తిగా వేడుకుంటే చాలు.. ఆ బాధలన్నీ ఇట్టే సమసిపోతాయన్నది సాయిభక్తులందరికీ అనుభవైకవేద్యమే!.. అనితరసాధ్యమైన తన మహిమలతో భక్తకోటి కోరికలను తీరుస్తూ, వారి కష్టాలను కడతేరుస్తూ ఆపద్బాంధవునిగా, భక్తవరదునిగా శ్రీ సాయినాధుడు అందరి పూజలందుకుంటున్నాడు. ఒక్క షిరిడీలోనే కాదు.. తనను నమ్మికొలిచే భక్తులందరి హృదయాలయాల్లోనూ శ్రీ సాయిదేవుడు కొలువై ఉన్నాడు. శాంతి-సహనం(సబూరి)తో అందరూ కలసిమెలసి జీవించాలని, ఒకరిపట్ల మరొకరు ప్రేమ, దయ, కరుణతో ఉండాలనే మానవీయమైన బోధనలతో మానవాళికి మార్గదర్శనం చేసిన మహనీయుడు.. మహాయోగి.. సాక్షాత్తూ శ్రీ దత్తావతార స్వరూపుడు శ్రీ షిరిడీ సాయినాధుడు. అందుకే ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులు శ్రీ సాయినాధుని నిరంతరం సేవించుకుంటున్నారు. ఎందరో భక్తులు ఎన్నో చోట్ల శ్రీస్వామివారికి ఆలయాలు కూడా నిర్మించి తరిస్తున్నారు. ఆ కోవలో ఆవిర్భవించిన మరో అపురూపమైన శ్రీ షిరిడీ సాయినాధుని సన్నిధానమే.. నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్కు వద్దనున్న 'శ్రీసాయి సదన్'!..*

### ఆలయ చరిత్ర :

శ్రీ షిరిడీ సాయిపై నిరుపమానమైన భక్తితో నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో 'శ్రీ సాయిసదన్' ఏర్పాటైంది. నగరానికి చెందిన సాయిభక్తుడు కొండ్రెడ్డి శ్రీనివాసులురెడ్డి శ్రీస్వామివారి అనుగ్రహంతో, స్థానిక భక్తుల సహకారంతో విశాలమైన స్థలంలో సర్వాంగసుందరంగా శ్రీ సాయి సదన్‌ను








నిర్మించి తన జీవితాన్ని ధన్యం చేసుకున్నారు. ఆ ఆలయంలో సుప్రశాంత వదనంతో కొలువుదీరివున్న శ్రీ సాయినాధుని దివ్యమంగళ విగ్రహాన్ని ఎంతసేపు చూసినా ఇంకా చూడాలనే అనిపిస్తుంటుంది. అయిదున్నర అడుగుల అందమైన ఆ పాలరాతి విగ్రహాన్ని జైపూర్‌లోని శిల్పులచే అత్యద్భుతమైన రీతిలో తయారుచేయించారు. ఆ విగ్రహానికి భక్తిశ్రద్ధలతో షిరిడీలో పూజలు చేసిన పిదప కడపజిల్లాకు చెందిన పూజ్యశ్రీ దర్గాస్వామీజీ, దర్గా మాతాజీ చేతులమీదుగా 2003 మార్చి 10వ తేదీన శ్రీసాయి సదన్‌లో ప్రతిష్ఠింపజేసి, సాయిభక్తులందరికీ స్వామివారి దర్శనభాగ్యం కలిగించారు. షిరిడీలోని ధుని నుంచి అగ్నిని తీసుకువచ్చి ఇక్కడ కూడా ధునిని ఏర్పాటుచేశారు. ఆ ఆలయం వెనుక ఉన్న స్థలంలో మరో చిన్న మందిరం కూడా నిర్మాణం చేయించి 2010 జూన్ 7వతేదీన దర్గాస్వామీజీ చేతులమీదుగానే 'ద్వారకామాయి సాయినాధుని' ప్రతిష్టింపజేసి ఆలయ వ్యవస్థాపకులు శ్రీనివాసులురెడ్డి భక్తులకు మరింత కన్నులపండువ చేశారు.


### నిత్యపూజలు..

శ్రీ సాయిసదన్‌లో కొలువైవున్న శ్రీ షిరిడీ సాయిదేవునికి అను నిత్యం పూజలు సేవలు జరిగేందుకు ఎలాంటి లోటు లేకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. నిత్యం హారతులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు సునీల్‌స్వామి, ఆంజనేయులస్వామి ఆధ్వర్యంలో ప్రతిరోజూ విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణంతో పాటు రుద్రాభిషేకం, అష్టోత్తర శత నామావళి, సాలగ్రామ పూజలు వేడుకగా జరుగుతుంటాయి. ప్రతి గురువారం పల్లకిసేవ అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుంది. శ్రీరామ నవమి రోజున పుష్ప రథోత్సవం, గంధ మహోత్సవ సేవలు నిర్వహిస్తుంటారు. ప్రత్యేకించి గురుపూర్ణిమ రోజున సాయినాధునికి భక్తులే స్వయంగా అభిషేకం చేసే భాగ్యం కూడా కలిగించారు. అంతకన్నా బాబా భక్తులకు కావాల్సిందేముందీ?!...



*'బాబా ఉండగా భయమెందుకు?.. నేను భౌతికంగా లేకున్నా.. నా సమాధినుండే మీకు దర్శనమిస్తాను.. నా సమాధి నుండే మీకు నేను సమాధానమిస్తాను..మీ కష్టాలు తీరుస్తాను!.. అంటూ శ్రీ సాయినాధుడు భక్తులకు అభయమిచ్చిన విషయం అందరికీ తెలిసిందే. అయినా.. మానవమాత్రులమైన మనకు ఈ కలికాలంలో అంతటి భరోసా మనకెవరివ్వగలరు?.. ఆ సాయినాధుడు తప్ప!. ఆడినమాట తప్పకుండా నేటికీ కోట్లాదిమంది భక్తులను బాబా కరుణిస్తూనే ఉన్నాడు కూడా. శ్రీసాయి సదన్‌లోని చిరునవ్వుల బాబా రూపం అందుకు ప్రతీకగా మనకు దర్శనమిస్తుంటుంది.*

# కల్యాణ వైభవం...!




నెల్లూరుజిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాలలో పనిచేసి,
ప్రస్తుతం నర్సాపూర్ డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా విధులు నిర్వహిస్తున్న స్నేహశీలి,
నెల్లూరీయులందరికీ సుపరిచితులు పొన్నపాటి వీరాంజనేయరెడ్డి - ఉమల కుమార్తె మన్విత - బ్రెయిన్‌ల
కల్యాణం మే 21వ తేదీ పాలకొల్లులో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న 'గౌరవ డాక్టరేట్' పురస్కార గ్రహీత రవీంద్ర సన్నారెడ్డి కుటుంబ సభ్యులు, ఆప్తులు, ఆత్మీయులు, నగర ప్రముఖులు.

# భక్తజన సంద్రంగా.. జొన్నవాడ

## కనువిందుగా శ్రీ కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలు



సింహవాహనంలో ఊరేగుతున్న
శ్రీ మల్లికార్జునస్వామి, శ్రీకామాక్షితాయి అమ్మవారు

జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో పెన్నానది ఒడ్డున ఉన్న జొన్నవాడకు భక్తజనులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతమంతా భక్తజనసంద్రంగా మారింది. ఈనెల 21 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆలయప్రాంతాన్నంతా విద్యుద్దీపకాంతులతో శోభాయ మానం చేశారు. స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకారాలు చేసి వాహనసేవలను అత్యద్భు తంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో అయిదవరోజైన ఈనెల 25న ఆలయ అర్చకులు గణపతి పూజలు, దేవీసప్తశతి పారాయణం, హోమాలు, తిరుచ్చి ఉత్సవాల అనంతరం రాత్రికి అత్యంత వైభవంగా సింహవాహనసేవ నిర్వహించారు. ఈనెల 26న గురువారం నాడు స్వామి వారికి, అమ్మవారికి విశిష్టపూజలు చేసిన తర్వాత జరిగిన హంసవాహనోత్సవం భక్తులకు కన్నులపండువ చేసింది. ఆలయ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఇ.ఓ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 31వ తేది వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈనెల 28న వెండినంది సేవ, 29న రథోత్సవం, 30న కల్యాణోత్సవం, రాత్రికి తెప్పోత్సవం తదితర సేవ లన్నీ నేత్రపర్వంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు.

# అనుమతించిన ప్రాంతాల్లోనే ఆక్వా సాగు

కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ యాక్ట్-2005 ప్రకారం కేంద్రప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో గుర్తించిన ప్రాంతాల్లో మాత్రమే ఆక్వా సాగు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 23న కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆ యాక్ట్ పట్ల రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఆక్వాసాగు జరుగుతున్న ప్రాంతాల్లో మంచినీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి కొత్తగా ఆక్వాకల్చర్ జరిగే ప్రాంతాలపై దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి షణ్ముఖకుమార్, ఆర్డీఓలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు రాయితీలు

జిల్లాలో సూక్ష్మ సేద్యం కింద పంటపొలాలను సాగుచేసుకునే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలను అందిస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏపిఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరానికి జిల్లాలో 6900 హెక్టార్లలో సూక్ష్మసేద్యం చేపట్టాలనే లక్ష్యంతో కృషి జరుగుతోందని, బిందుసేద్యం, నీటి తుంపరసేద్యం పరికరాలను రాయితీపై ఇచ్చేందుకు ఏడు కంపెనీలు ముందుకొచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరికరాల కోసం దరఖాస్తు చేసుకునే రైతులకు రెండు హెక్టార్ల లోపు భూమి ఉంటే 90శాతం, 5 హెక్టార్ల లోపు భూమి ఉన్నవారికి 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. తుంపర్ల పరికరాలు (స్ప్రింకర్లు) అన్ని వర్గాల రైతులకు 50 శాతం రాయితీతో అందజేయనున్నామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, లబ్దిదారులు ఎంపికచేసుకున్న సంస్థల ధరలను అనుసరించి రాయితీ వర్తింపజేస్తామన్నారు.

# విభజించు.. పాలించు

(మొదటి పేజీ తరువాయి)

నిర్లక్ష్య నిద్రలో, అధికార మత్తులో ఉన్న ఇంటెలిజెన్స్, పోలీసు, నిఘా వర్గాల పనితీరుకు ఈ ఘటన అద్దంపడుతోంది. అధికార పార్టీ మంత్రి నివాసమే నిరసనకారుల చేతిలో మాడి మసైపోవడం ప్రభుత్వ పాలనపై పడ్డ మాసిపోలేని మచ్చ.

సుభిక్షంగా ఉన్న రాష్ట్రాన్ని ప్రాంతాల ప్రాతిపదికగా విభజించాలని 'అమ్మోరు' నిర్ణయించడంతో అన్నీ డబల్ డబల్ అయ్యాయి. ఇద్దరు ముఖ్యమంత్రులు... ఇద్దరు గవర్నర్‌లు... ఇద్దరు చీఫ్‌సెక్రటరీలు... ఇద్దరు డీజీపీలు... రెండు హైకోర్టులు... రెండు సచివాలయాలు.

ఇప్పుడు, ఆ విభజిత ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఓ నిర్ణయం సమాజాన్ని అతలాకుతలం చేసింది. అత్యంత వివాదాస్పదం అవుతుంది అని తెలిసే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందా, ఇలా జరుగుతుందని ఊహించలేక తీసుకుందా, కావాలనే తీసుకుందా, యధాలాపంగా తీసుకుందా, జన స్పందన ఎలా ఉంటుందో చూద్దామని తీసుకుందా, లేక వచ్చే ఎన్నికల్లో ఓ కొత్త ఓట్ బ్యాంకును సృష్టించుకోవడానికి చేసిందా...? అన్నది మేధావులకు సైతం అర్ధంకాని అంశం.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను మూడు జిల్లాలుగా విడదీశారు. ఆ జిల్లాలో మూడు ఎంపీ స్థానాలు ఉండడంతో, అది మూడు ముక్కలైంది. అందులో అమలాపురం కేంద్రంగా ఉన్న కోనసీమ ఒకటి. ఏప్రిల్ 4న ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలలో 'కోనసీమ' జిల్లా కూడా ఉంది. అది అందరికీ ఇష్టమైన పేరు కావడంతో ఆ పేరు పట్ల ఒక్క శాతం అభ్యంతరం కూడా వ్యక్తం కాలేదు.

కోనసీమలో 'కుల సమీకరణ మైండ్‌సెట్' అన్నది రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు చాలా భిన్నంగా ఉం టుంది. ఇది అంతర్లీనంగా దశాబ్దాలుగా అక్కడ కొనసాగుతున్న ఓ సామాజిక దురాచారం. కోనసీమలో ఉన్న ఒక ఎంపీ స్థానం, ఏడు అసెంబ్లీ స్థానాల్లో మూడు రిజర్వుడు స్థానాలు... ఈ 'మైండ్‌సెట్'కు బాగా బలం చేకూరుస్తూ వస్తున్నాయి. కోనసీమలో ఎస్సీలు, శెట్టి బలిజ, కాపులు బలమైన సామాజిక వర్గాలు. ఏ రెండు వర్గాలూ ఏ విషయంపైనా ఎప్పటికీ ఒక తాటిపైకి రాకపోవడం వీటి ప్రత్యేకత.

కోనసీమలోని దళితులు సంఘటితం కావడంలో భాగంగా గ్రామ గ్రామాన అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పడాన్ని వారు ఒక ఉద్యమంగా చేపట్టారు. ఫలితంగా అంబేద్కర్ విగ్రహం లేని గ్రామమే కోనసీమలో కనపడదు. ఈ విగ్రహాల కారణంగానే గతంలో దళితులకు... దళితేతరుల మధ్య అనేక ఘర్షణలు చెలరేగాయి కూడా. అంటే, అంబేద్కర్ కారణంగా, కోనసీమలో వివిధ వర్గాల మధ్య ఒక 'మానసిక విభజన' కొనసాగుతున్న విషయం బహిరంగ రహస్యమే.

ఈ నేపథ్యంలో, కొత్త జిల్లాలు ఏర్పడ్డ నెలరోజులు దాటిన తరువాత 'కోనసీమ' జిల్లాను 'బీఆర్ అంబేద్కర్ కోనసీమ' జిల్లాగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో కోనసీమలోని దళితేతర వర్గాలు విస్తుపోయాయి.

కోనసీమ జనాభా(సుమారు 17.20లక్షలు)లో దాదాపు 25 శాతం ఉన్న దళితులు ప్రభుత్వ నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తే, చీలికలు పీలికలుగా ఉన్న బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, బీసీ, రెడ్డి, కమ్మ, కాపు, శెట్టి బలిజ వంటి సమస్త సామాజిక వర్గాలు కోనసీమ చరిత్రలో మొదటిసారిగా ఒక్కటయ్యాయని అంటున్నారు. అంటే కోనసీమ సమాజం దళితులు... దళితేతరులుగా చీలిపోయింది. తమపై దళిత పెత్తనాన్ని ప్రభుత్వం రుద్దుతుందని 75 శాతం మంది దళితేతరులు ఆత్మ న్యూనతా భావానికి లోనయ్యారు. ఎందుకంటే కోనసీమ దళితుల మనసులలో 'అంబేద్కర్' అంటే దళితుల సొంతం అనే భావన ఇప్పటికే బలంగా నాటుకుపోయింది. అంతే తప్ప, అంబేద్కర్‌పై దళితేతర సమాజానికి అగౌరవం లేదు. ఆ మహనీయుడి పేరు వాడుకుంటున్న కోనసీమ దళితులపైనే మిగిలిన వర్గాల వారి అసహనం అని కోనసీమలోని పలు ప్రాంతాలలో సామాజిక సంస్థల ప్రతినిధులు చెప్తున్నారు. ఈ అంతరాన్ని ప్రభుత్వం తెలివిగా వాడుకున్నట్టు కనబడుతోందని రాజకీయ విశ్లేషకుల భావన. దాని ఫలితమే ఈ అల్లర్లు అని వారి ఉద్దేశ్యం.

## కిం కర్తవ్యం...!

అధికార, ప్రతిపక్ష పార్టీలు 'మీరు కారణం అంటే... మీరే కారణం' అంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నప్పటికీ, దళితులు దళితేతరుల మధ్య జరగవలసిన మానసిక విభజన జరిగిపోయింది.

ప్రభుత్వం తెలిసి ఒక వ్యూహం ప్రకారం కోనసీమలోకి అంబేద్కర్‌ను దింపినప్పటికీ, అమాయకంగా ఆయన పేరును జిల్లాకు తగిలించినప్పటికీ... ప్రభుత్వ నిర్ణయం మిస్‌ఫైర్ అయిందనే మాట రాజకీయ పరిశీలకుల నుండి వినపడుతోంది. కోనసీమలో దళితులు... దళితేతరులు... ఈ రెండింటిలో ఒక వర్గాన్ని వైసీపీ వదిలేసుకోవలసిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

'బీఆర్ అంబేద్కర్ కోనసీమ' జిల్లా కొనసాగుతుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. దీంతో, కోనసీమలో గల 75% దళితేతరులు వైసీపీకి దూరమయ్యే అవకాశం ఉందన్నది మేధావుల అంచనా. ఒకవేళ, కోనసీమలోని మెజారిటీ ప్రజల అభిమతానికి అనుగుణంగా ప్రభుత్వం వెనక్కి తగ్గి, జిల్లా పేరును 'కోనసీమ' జిల్లాగా ఉంచితే కోనసీమలోని దళితులతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ముందుకు వెళ్ళాలా...? వెనక్కు తగ్గాలా...?? అని ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఇదే తరుణంలో ప్రతిపక్ష పార్టీలు ఈ అంశాన్ని తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు ముమ్మరంగా మొదలుపెట్టాయి. మొదటి అడుగు ఎవరిదైనా, ఇప్పుడు విభజన ఆంధ్రలో అన్ని రాజకీయపార్టీల అడుగులు 'విభజించు - పాలించు' అన్న సూత్రంతో ముందుకు పడుతున్నాయి. అదే పంథాతో తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నాయి. శాశ్వత అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టులు ఏర్పాటు చేసుకోలేకపోవడంతో పాటు ఎలాంటి అభివృద్ధి లేని నవ్యాంధ్ర లో 'పాలిట్రిక్స్' మాత్రం సమృద్ధిగా ఉన్నాయంటున్నారు సీనియర్ రాజకీయవేత్తలు.

## నెల్లూరుకు వచ్చి వెళ్లిన గవర్నర్

(5వ పేజీ తరువాయి)


చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు తదితరులు స్వాగతం పలికారు. విఎస్‌యు ప్రాంగణంలో ఉప కులపతి ఆచార్య జిఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డా.ఎల్‌వి.కృష్ణారెడ్డిలు గవర్నర్‌ను సాదరంగా స్వాగతించారు. ఈ స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి నూతన ఆవిష్కరణలు జరగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు. గాంధీ మహాత్మునితోపాటు ఎందరో దేశభక్తులు ప్రాణాలను పణంగాపెట్టి దేశానికి స్వాతంత్ర్యం సాధించారని, అలాంటి త్యాగధనులను స్ఫూర్తిగా తీసుకుని దేశ ప్రగతికి విద్యార్థులు కృషిచేయాలని స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో హైదారాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ డిఎన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు కూడా తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విఎస్‌యు అభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్న విఎస్‌యు వైస్‌చాన్సలర్ జిఎం సుందరవల్లిని, విఎస్‌యు సిబ్బందిని ఈ సందర్భంగా గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. తొలుత విఎస్‌యులో జరుగుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలను విఎస్‌యు వైస్‌ఛాన్సలర్ జిఎం సుందరవల్లి వివరించారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించి గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్, రీసెర్చి స్కాలర్స్‌గా పట్టాలు పొందిన 18 మందికి గవర్నర్ చేతులమీదుగా పట్టాలు, బంగారుపతకాలు అందజేశారు. గవర్నర్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా, కలెక్టర్ చక్రధర్‌బాబు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### క్యాన్సర్ ఆసుపత్రి సందర్శన


గవర్నర్ తన పర్యటనలో భాగంగా నెల్లూరులోని క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించారు. రేడియో థెరపీ బ్లాక్-2 భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఆ తర్వాత రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సేవకు ప్రతిరూపం రెడ్‌క్రాస్ అన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్ సేవలను ఇప్పటిదాకా వినడమే కానీ నేరుగా చూడడం ఇదే ప్రథమమని అంటూ, నెల్లూరు రెడ్‌క్రాస్ సేవలను గవర్నర్ కొనియాడారు. ప్రత్యేకించి కరోనా సమయంలో రెడ్‌క్రాస్ ప్రజలకు అందించిన సేవలను అభినందించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ అనేక సేవాకార్యక్రమాలు చేస్తుండడం పట్ల గవర్నర్ సంతోషం వ్యక్తం చేశారు. మానవసేవే మాధవసేవగా భావించి నిస్వార్థంగా సేవ చేసే మానవతామూర్తులందరికీ ఆ దేవుని ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏ.శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

### ఆసుపత్రి అభివృద్ధికి.. 5 లక్షల విరాళం



మనుబోలు మండలం అక్కంపేట సర్పంచ్ నారపరెడ్డి జాంబవతి, ఆమె కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి ఈనెల 24న 5లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతులమీదుగా ఆసుపత్రి నిర్వాహకులకు అందజేశారు. తమ కుటుంబ పెద్ద దివంగత నారపరెడ్డి సీతారామిరెడ్డి జ్ఞాపకార్థం ఈ విరాళం అందించినట్లు వారు చెప్పారు. క్యాన్సర్ ఆసుపత్రి కోసం విరాళమిచ్చిన ఆ దాతలను గవర్నర్ అభినందించారు.

# టీడీపీది ఏ దారి?.. రహదారా! దొడ్డిదారా!!



తెలుగుదేశం పార్టీకి ఒక్కటే ప్రశ్న వేయాలి. వచ్చే శాసనసభ ఎన్నికల్లో తనను చూసి తనకు ఓట్ వేయాలని భావిస్తున్నదా...? లేక వైసీపీని చూసి తనకు ఓట్ వేయాలని టీడీపీ భావిస్తున్నదా?

ఈ రెండు ప్రశ్నలూ ఒక్కటే గదా అన్నట్టు కనబడుతు నప్పటికీ ఒక్కటి కాదు. చాలా తేడా ఉంది.

మొదటి ప్రశ్న... ప్రజల పట్ల, సమాజం పట్ల ఉండవలసిన టీడీపీ సానుకూల దృక్పథానికి సంబంధించినది. 'మాకు అధికారం ఇవ్వండి. మేము రాష్ట్రానికి ఇది చేస్తాం... అది చెయ్యం...' అని ప్రజలకు ఒక భరోసా, ఒక నమ్మకం, ఒక సానుకూల... విశ్వసనీయ సందేశం ఇవ్వడం ద్వారా వారి అభిమానాన్ని చూరగొనే ప్రయత్నం నిజాయితీగా చేయడం. ఓటర్లను కన్విన్స్ చేసుకోవడం ద్వారా మెజారిటీ సీట్లు సాధించి అధికారంలోకి రావడం. అధికారానికి ఇది రహదారి. రాజమార్గం.

రెండవ పద్ధతిలో... వైసీపీపై వ్యతిరేక ప్రచారం నిర్వహించడం ద్వారా అధికారంలోకి రావాలని టీడీపీ భావించడం.

ఇది పూర్తిగా నెగెటివ్ అప్రోచ్. రేయింబవళ్లు వైసీపీపై విరుచుకుపడడం. అల్లరల్లరి.... రచ్చ రచ్చ చేసి పారేయడం ద్వారా వైసీపీని వీలైనంతగా అప్రదిష్టపాలు చేసి, తద్వారా మెజారిటీ సీట్లు గెలిచే ప్రయత్నం చేయడం. ఇది దొడ్డి దారి. దొంగ దారి.

ఈ రెండు మార్గాలలో టీడీపీ ఏది ఎంచుకుంటుంది అనేది ప్రశ్న.

మరో రెండు రోజుల్లో తెలుగుదేశం పార్టీ మహానాడు పేరిట ఒంగోలులో వార్షిక సదస్సులు జరుపుకోబోతున్నది. చంద్రబాబు, ఇతర పెద్ద నేతల, 'ఆత్మ స్తుతి - పరనింద' ప్రసంగాలు, కాగితాలకు పరిమిత మయ్యే తీర్మానాలతో ఈ మహానాడు ముగిస్తారా... లేక, ఏమైనా అర్థవంతమైన ఆత్మ పరిశీలన, ఆచరణాత్మక కార్యక్రమాల రూపకల్పన చేస్తారా? అనేది చూడవలసి ఉంది.

ప్రస్తుతం ప్రతిపక్ష నాయకుడిగా ఉంటున్న తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు అప్పుడే 'పాత మోడ్'లోకి వెళ్లిపోయారు. తనకు బాగా అలవాటైన భాషలో ఈదులాడుతున్నారు.

తాను ముఖ్యమంత్రి కావాలని ప్రజలు భావిస్తు న్నారని, పిల్లల భవిష్యత్ బాగుండాలంటే తాను ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన ప్రైవేట్‌గా కాకుండా 'బహిరంగ' సభల్లోనే గట్టిగా.... పదే పదే చెబుతున్నారు.

మరి, అంత గట్టిగా కోరుకునే ప్రజలు 2019లో అంత ఘోరంగా ఎందుకు ఓడించారు? ఆయన మీద, టీడీపీ మీద అంత ఆగ్రహం, అంత కసి ప్రజలకు అప్పుడు ఎందుకు కలిగాయి? 2004లో ఎందుకు ఓడించారు? చంద్రబాబులో ఏమి మార్పు వచ్చిందని ఆయనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుతున్నారు? ఇప్పుడు తనను తాను ఆయన ఏమి దిద్దుకున్నారని ప్రజలు భావిస్తున్నారు? 2004 నాటి, 2019 నాటి చంద్రబాబే కదా ఇప్పుడు కూడా మనకు కనబడుతున్న చంద్రబాబు? లేక ఏమైనా మారారా?

'ఇదిగో! 2014లో మీరు అధికారం ఇచ్చిన తరువాత, ఆ అయిదేళ్లల్లో.... పార్టీపరంగా గానీ, నా పరంగా గానీ ఈ తప్పులు తెలిసో... తెలియకో జరిగాయి. ఇందుకు విచారిస్తున్నాం. ఆ తప్పులు పునరావృతం కానివ్వం. మాకు మరోసారి అధికారం ఇవ్వండి. మీ నమ్మకాన్ని నిలబెట్టుకోడానికి శాయశక్తుల ప్రయత్నిస్తాం...' అనే వాగ్దానంతో ప్రజల ముందుకు వెళ్లడం మొదటి పద్ధతి.

ఈ తరహా ప్రచారంలో వైసీపీపై విమర్శలకు తావు లేదు. తమకు అధికారం ఇస్తే ఏమి చేయగలమో.... ఏమి చేయమో, ఏమి చేయలేమో ప్రజలకు వినమ్రంగా, నిజాయతీగా చెప్పుకోవడమే తెలుగుదేశం ప్రచార సరళి కావాలి. ఒక పాజిటివ్ ఓట్‌తో అధికారంలోకి రావాలని టీడీపీ భావిస్తోంది అనే సంకేతాలతో ఆ పార్టీకి తటస్థ ఓటర్లలో మంచి మార్కులు పడతాయి. టీడీపీ పట్ల మామూలు ఓటర్లలో ఒక సానుకూల భావన కలుగుతుంది. టీడీపీ పట్ల గౌరవం పెరుగుతుంది.

వైసీపీ పార్టీ, ప్రభుత్వం ఏ ఏ రకమైన అక్రమాలకు పాల్పడుతున్నదని టీడీపీ నేతలు ఇప్పుడు విరుచుకుపడుతున్నారో... విమర్శిస్తున్నారో.... ఆరోపిస్తున్నారో... ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాస్తున్నారో.... ధర్నాలు, రోడ్ రోకోలు చేస్తున్నారో... ఆ రకమైన అరాచక పనులు, అవినీతి పనులు, తప్పుడు పనులు, కబ్జా పనులు, రౌడీ పనులు, దోపిడీ పనులు తాము అధికారంలోకి వస్తే చెయ్యము... చెయ్యనివ్వము అని ప్రజలకు టీడీపీ నేతలు చెప్పాలి. ప్రజల అభిమానం ఆ విధంగా చూరగొనే ప్రయత్నం చేయడం పాజిటివ్ ఎలక్షనీరింగ్.

ఈ పద్ధతిలో వైసీపీ ఏమిటి అనేది టీడీపీకి అనవసరం. వారి పాలన వారి పాలనే. టీడీపీ పాలన ఎలా ఉంటుందో జనానికి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేయాలి. అప్పుడు ప్రజలే బేరీజు వేసుకుంటారు, చంద్రబాబుకు మరోసారి పాలనా పగ్గాలు అప్పగించాలా... వద్దా అనే విషయం.

ఈ విధానంలో అధికారంలోకి రావాలని టీడీపీ భావిస్తూ ఉంటే... ఒక 'వాగ్దాన పత్రం' విడుదలచేస్తే ప్రజలు ఆ దిశగా ఆలోచించడం ప్రారంభమవుతుంది. తెలుగుదేశం నేతలు ఎప్పుడు, ఎందుకు నోరు ఎత్తినా, ఆ వాగ్దాన పత్రంలోని అంశాలకే పరిమితమైతే, రాష్ట్రంలో టీడీపీ పట్ల ప్రజల్లో ఒక సానుకూల అభిప్రాయం ఏర్పడుతుంది. అధికారానికి ఇది రాజమార్గం. రహదారి.


ఇది 'కేజ్రీవాల్ మోడల్ ఆఫ్ ఎలక్షనీరింగ్' అని కూడా చెప్పవచ్చు.

ప్రస్తుతం ఢిల్లీకి ముఖ్యమంత్రిగా ఉన్న కేజ్రీవాల్, 2013లో మొదటిసారి ముఖ్యమంత్రి అయ్యారు. 70 స్థానాలు గల అసెంబ్లీలో పూర్తి మెజారిటీ రాలేదు. కాంగ్రెస్‌పై ఆధారపడాల్సి వచ్చింది. రాజకీయ పాలనానుభవం, సహనం, సంయమనం మొదలైన లక్షణాలు కొరవడిన ఆయన 49 రోజులకే రాజీనామా చేసి అవతల పారేశారు.

ఆయనపై ఒక అరాచకవాది, యారొగెంట్ అనే ముద్రలు బలంగాపడ్డాయి. పాలిటిక్స్‌కు పనికిరాడు అన్నారు. ఆయన చాప్టర్ క్లోజ్ అనుకుంటూ బీజేపీ యులు సంబరపడ్డారు. ఢిల్లీ ఇక తమదే అనుకున్నారు.

ఏడాది తిరక్కుండానే, కేజ్రీ తన తప్పు ఏమిటో తెలుసుకున్నారు. 2014లో సీఎం పదవికి అంత తలబిరుసుగా రాజీనామా ఇచ్చి ఉండవలసింది కాదు అని అర్థమయింది.

అంతే! '2013-14లో తప్పు చేశాను. క్షమించండి....' అనే ఏకవాక్య ప్రణాళికతో ఆయన ఢిల్లీలో గల్లీ గల్లీ తిరిగారు. క్షమించమని ప్రజలను అభ్యర్థించారు. ఆ అభ్యర్థనలో ఢిల్లీ ఓటర్లకు నిజాయతీ కనిపించింది. మారిన మనిషి కనిపించాడు. 2015 ఎన్నికల్లో 70 స్థానాలకుగానూ 67 స్థానాలు కట్టబెట్టారు.



బీజేపీ తల్లకిందులుగా తపస్సుచేస్తే, మోదీ-షా ఢిల్లీ అంతా కలియతిరిగితే, తొలి మహిళా ఐపీస్ అధికారి కిరణ్‌బేదీని సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే బీజేపీకి వచ్చిన సీట్లు మూడు. కిరణ్‌బేదీ కూడా ఓడిపోయారు.

అదీ 'నిజాయతీ' పవర్.




తెలుగుదేశం ఆ ఫార్ములాను చేపడితే, 2014-2019 మధ్యకాలంలో తమ వల్ల జరిగిన.... లేదా జరిగాయని ప్రజలు అనుకుంటున్న తప్పులకు 'నిజాయతీ'తో కూడిన క్షమాపణలు చెప్పుకుంటూ వెడుతూనే, వైసీపీ పాలనలో ఇప్పుడు జరుగుతున్నాయని టీడీపీ భావిస్తున్న తప్పొప్పులు, నేరాలు - ఘోరాలు తమ హయాంలో జరగవని టీడీపీ గనుక వాగ్దానం చేయగలిగితే టీడీపీ ప్రయాణంలో అదో కొత్త చరిత్ర అవుతుంది. దాని ఫలితం దానికి ఉంటుంది. అయితే, అహంభావం, స్వోత్కర్ష, భేషిజం, బిల్డప్ మొదలైనవాటికి కేజ్రీవాల్ మోడల్‌లో తావు ఉండదు.

ఇక, రెండో పద్ధతి నెగటివ్ ఎలక్షనీరింగ్. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తున్న విధానం ఇది. వైసీపీ ప్రభుత్వం, పార్టీ, నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై విరుచుకుపడడం... మీడియాలో ఏకి పాకం పెట్టడం... ధర్నాలు, ఊరేగింపులు చేయడం... ముఖ్యమంత్రికి, డీజీపీకి ఉత్తరాలు సంధించడం. తద్వారా వైసీపీని అన్ని కోణాల్లో ప్రజల ముందు దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేయడం.

సరే. వైసీపీని ప్రజల ముందు దోషిగా నిలబెడతారు అనుకుందాం. మరి, ప్రజలు ఏమి చేయాలి అని టీడీపీ భావిస్తోంది? వైసీపీని ఓడించాలి అనే కదా! సరే. వైసీపీని ఓడించారు అనుకుంటే.. మరి ఎవరిని గెలిపించాలి? ఆంధ్రలో బీజేపీని పూచికపుల్లతో కూడా ఓటర్లు ముట్టుకోరు. సీపీఐ, సీపీఎంకు అసలు ఆ వాసన కూడా పడదు. జనసేన ఇంకా పిండె దశలోనే ఉంది. అది కొంచెం కాయ రూపం తీసుకుని, పలకమారడానికి ఇంకో రెండు, మూడు ఎన్నికల సీజన్ల పైనపడుతుంది. ఇక, మిగిలింది తెలుగుదేశం. అందువల్ల, చచ్చినట్టు తనను ఓటర్లు గెలిపిస్తారు అని టీడీపీ ఉద్దేశమా?

ఏం చూసి? వైసీపీని బాగా అల్లరి చేసిందనా? వైసీపీ చేసినట్టుగా టీడీపీ చెబుతున్న "తప్పులు, దోపిడీ, అక్రమాలు, అరాచకాలు, కబ్జాలు, దౌర్జన్యాలు, రేపులు, ఎల్లుండులు..." టీడీపీ పరంగా జరగవనా....? టీడీపీలో 'అవి' కొనసాగవని టీడీపీ నాయకత్వం ప్రజలకు స్పష్టమైన, నిర్దిష్టమైన హామీ ఇవ్వకపోతే వైసీపీని ఓడించడమెందుకూ.... టీడీపీని గెలిపించడమెందుకు!? ఏ రాయి అయితేనేం... పళ్ళు ఊడగొట్టకోడానికి! ఎవరైతేనేం ఇసుక అమ్ముకోడానికి? ఎవరైతేనేం కొండలూ... గుట్టలూ తవ్వకోడానికి? ఎవరైతేనేం... పోలీసులతో బాదించడానికి? ఎవరైతేనేం కమిషన్లు కుమ్మడానికి?

ఎవరైతేనేం.... ఇలాంటి సవాలక్ష 'ప్రజాసేవ' కార్యక్రమాలు చేయడానికి? అని జనం అనుకుంటే.... తప్పు పట్టాల్సిన పని ఉంటుందా?

అందుకే... తెలుగుదేశం నేతలు నోళ్లు కాకుండా మెదళ్ళు వాడాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేయడానికి, ఒక మంచి పాలనపై ప్రజలకు భరోసా ఇవ్వడానికి, వారి నమ్మకం మరోసారి చూరగొనడానికి ఏమి చేయాలో చంద్రబాబు, ఇతర పెద్దలు ఆలోచించాలి.

**- భోగాది వేంకట రాయుడు**
@venkata_bhogadi



## రాజ్యసభకు బీద మస్తాన్‌రావు.. నామినేషన్

రాజ్యసభకు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) ఈనెల 25న నామినేషన్ దాఖలు చేశారు. అమరావతిలోని అసెంబ్లీ భవనంలో ఎన్నికల అధికారి, శాసనమండలి ఉప కార్యదర్శి పివి సుబ్బారెడ్డికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బిఎంఆర్‌తో పాటు ఆయన అభిమానులు, బిసి, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ నాయకులు భారీగా తరలివచ్చారు. అదేరోజున వైఎస్సార్సీపి అభ్యర్థులు వి.విజయసాయిరెడ్డి, ఎస్ నిరంజన్‌రెడ్డి, ఆర్ కృష్ణయ్యలు కూడా నామినేషన్ పత్రాలిచ్చారు. వీరివెంట ఉప ముఖ్యమంత్రులు కె.నారాయణస్వామి, మంత్రులు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మేరుగ నాగార్జున, జోగి రమేష్, కారుమూరి వెంకటనాగేశ్వరరావుతో పాటు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరు ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎంఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో తమ వాణిని వినిపించడమే ధ్యేయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రభుత్వంతో పాటు నామినేటెడ్ పదవుల్లోనూ 50 శాతానికి పైగా అవకాశం కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. గత 56 ఏళ్ళ చరిత్రలో యాదవ సామాజికవర్గానికి రాజ్యసభ సభ్యత్వం దక్కలేదని, కనీవినీ ఎరుగని విధంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోని వైకాపా తరపున ఆ అవకాశం కలగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు రాజ్యసభ అభ్యర్థిగా అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, ఇతర నాయకులకు ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు. సిఎం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బిసి, ఎస్సీ,ఎస్టీ,మైనార్టీవర్గాల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని బిఎంఆర్ చెప్పారు.

### ఆత్మకూరు ఉప ఎన్నికకు..

# నగారా మోగింది




- జూన్ 23న ఎన్నిక, 26న ఓట్ల లెక్కింపు

దేశవ్యాప్తంగా 3 లోక్‌సభ, 7 శాసన సభా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు శాసనసభ స్థానానికి కూడా ఉప ఎన్నిక నిర్వహించనుంది. ఆమేరకు ఈనెల 25వ తేది రాత్రి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఆత్మకూరు నుంచి వైకాపా అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో నిలిచి గెలిచి ఎమ్మెల్యేగా, ఆ తర్వాత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి హఠాన్మరణంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అవసరమైంది. ఆత్మకూరు ఉప ఎన్నికకు జూన్ 23న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లయింది. జూన్ 26న కౌంటింగ్ పూర్తయ్యేదాకా ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. ఎన్నికల షెడ్యూలు ప్రకారం మే 30న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. నామినేషన్ల స్వీకరణకు తుది గడువు జూన్ 6 దాకా ఉంటుంది. జూన్ 7న నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహారణకు జూన్ 9వ తేది తుది గడువు. పోలింగ్ జూన్ 23 గురువారం జరుగుతుంది. ఓట్ల లెక్కింపు జూన్ 26న ఉంటుంది.

**రాజకీయం గరం గరం :**


ఈ ఎన్నికలో గౌతమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు పోటీచేస్తారన్నది అందరికీ తెలిసిందే. ఆ మేరకు వారు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రెండవ కుమారుడైన మేకపాటి విక్రమ్‌రెడ్డి (గౌతమ్ రెడ్డి సోదరుడు) ఈ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా పోటీచేస్తారని భావిస్తున్నారు. ఆత్మకూరు నుంచి గౌతమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు పోటీచేస్తే తమ పార్టీ పోటీ చేయదని గతంలో టిడిపి ప్రకటించినప్పటికీ, ఆ విషయం పూర్తిస్థాయిలో నిర్ధారణ కావాల్సివుంది. ఒకవేళ ఈ ఎన్నికల్లో టిడిపి పోటీ చేయకున్నా బిజెపి, తదితర పార్టీలేమైనా పోటీలో ఉండే అవకాశం కూడా ఉంటుందని, దీంతో ఎన్నికలు అనివార్యమవుతాయేమోనని కూడా పరిశీలకులు భావిస్తున్నారు. ఏదేమైనా, ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్నికల వేడి రాజుకుంది. పార్టీల వారు తమ బలాబలాలు అంచనా వేసుకుంటున్నారు.

## ఉపఎన్నికను సజావుగా నిర్వహించాలి - రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి

ఆత్మకూరు ఉపఎన్నికను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను పకడ్బంధీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నెల్లూరు జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబును ఆదేశించారు. ఈనెల 26వ తేదీ గురువారం మధ్యాహ్నం ఆయన అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆత్మకూరు ఉపఎన్నికకు సంబంధించి పలు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ




ఎన్నికల ప్రక్రియను సక్రమంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు జిల్లాలో ఎన్నికల నియమావళిని కఠినంగా అమలుచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నెల్లూరు కలెక్టరేట్ నుండి కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీ హరేందిర ప్రసాద్, ఏఎస్‌పి హిమవతి పాల్గొన్నారు.

జననం
23.08.1934

నిర్యాణం
02.06.2021

## శ్రద్ధాంజలి

మా ఇంటి కీర్తి, అనురాగమూర్తి,
మంచితనం, మానవత్వం మూర్తీభవించిన ఆత్మీయదీప్తి,

**శ్రీ కాకుటూరు చంద్రశేఖరరెడ్డి గారు**

స్వర్గస్తులై తేది.2.6.2022 నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

భార్య : **కాకుటూరు సుగుణమ్మ**

కుమారుడు - కోడలు
**కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి - మాధవి**

మనుమడు - మనుమరాలు
**కాకుటూరు అభినయ్‌రెడ్డి - తన్మయి**

కుమార్తె - అల్లుడు
**చిట్టమూరు శైలజ - ప్రవీణ్‌కుమార్‌రెడ్డి**

మనుమరాలు - మనుమడు
**పుట్టంరెడ్డి శ్రీమనస్విని - గౌతమ్‌రెడ్డి**

మునిమనుమలు - మునిమనుమరాలు
**సహర్ష్, అయాన్ - అంజలి**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com